


చట్టం మీ చుట్టం
జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 ● సంచిక : 34 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi ఆదివారం 15 ఫిబ్రవరి 2026 ● పేజీలు : 8 ● వెల 2/-

## సేవాతీర్థ్ ప్రారంభంపై చంద్రబాబు అభినందనలు

**అమరావతి,ఫిబ్రవరి14 (చట్టం న్యూస్):** ఢిల్లీలో నూతనంగా నిర్మించిన ప్రధాన మంత్రి కార్యాలయం సేవా తీర్థ్ , సెంట్రల్ సెక్రటేరియెట్(కర్తవ్య భవన్) భవనాలను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఇక నూతన కార్యాలయంలో తొలి రోజున ప్రధాని ఓ కొత్త సంక్షేమ పథకాన్ని ప్రారంభించారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సాయం అందించేందుకు పీఎం-రాహత్ పేరుతో



మిగతా 2వ పేజీలో..

# రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు కేబినేట్ ఆమోదం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి14 (చట్టం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన శనివారం జరగిన కేంద్ర సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా ప్రధానమంత్రి కార్యాలయం పేరును 'సేవతీర్థ్'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే రూ.1,60,504 కోట్ల విలువైన పనులను చేపట్టాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది. అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోహుపూర్-నుమాలిఘర్ మధ్య అండర్ వాటర్ రోడ్డు టన్నెల్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. 34 కిలోమీటర్ల మేర అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ టన్నెల్ నిర్మాణంతో 250 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఈ టన్నెల్ నిర్మాణం ద్వారా 6 గంటల సమయం పట్టే గమ్యస్థానాన్ని కేవలం 20 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం ఉంది. బ్రహ్మపుత్ర నది కింద రైల్వేలైన్, నేషనల్ హైవే కోసం టన్నెల్‌ని నిర్మించనుంది. అలాగే కసారా-మన్మాడ్ మూడు,



నాలుగో రైల్వేలైన్ ప్రాజెక్ట్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బళ్లారి-హోస్పేట మధ్య రూ.2,372 కోట్లతో 3, 4 రైల్వేలైన్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. గూడె బేల్లూరు నుంచి మహబూబ్‌నగర్ సెక్షన్ మధ్య రూ.3,175 కోట్ల ఖర్చుతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మహబూబ్‌నగర్ , నారాయణపేట, రాయచూర్, దేవరకద్ర, హైదరాబాద్‌కు ఈ కనెక్టివిటీ ఉంది. హైదరాబాద్-పనాజీ కారిడార్‌లో భాగంగా కొత్త నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. 80 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3175 కోట్ల ఖర్చు చేయనుంది. దమాసియా- బిటాడ నర్సాపూర్ మలోత సెక్షన్ మధ్య నాలుగు లైన్ల నిర్మాణానికి రూ.4,584 కోట్లను ఖర్చు చేయనుంది. గోతి- త్రిమ్బక్ - పాల్గర్ సెక్షన్ అబ్రిడేషన్ కోసం రూ.3320 కోట్లని కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

## శ్రీశైలంలో వైభవంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

### పుష్పపల్లకిపై దర్శనమిచ్చిన మల్లికార్జునుడు

**శ్రీశైలం,ఫిబ్రవరి14(చట్టం న్యూస్) :** శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వైభవంగా జరుగుతున్నాయి. భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి అమ్మవారు పుష్పపల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. పుష్పపల్లకిలో శ్రీస్వామి అమ్మవారికి అర్చకులు వేదపండితులు ఆలయ చైర్మన్, సభ్యులు,ఈవో శ్రీనివాసరావు ప్రత్యేకపూజలు నిర్వహించి హారతులిచ్చారు. విద్యుత్ దీపకాంతుల నడుమ శ్రీశైలం పురవీధులలో శ్రీస్వామి అమ్మవార్లు గ్రామోత్స వానికి తరలుతుండగా... ఉత్సవం ముందు కోలాటాలు డమరక నాధాలతో పలు రకాల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం ఎదుట పలు రకాల

మిగతా 2వ పేజీలో..



# రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు కేబినేట్ ఆమోదం

**అమరావతి,ఫిబ్రవరి14 (చట్టం న్యూస్):** 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు ఏపీ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని, దాని ద్వారానే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని వివరించారు. రైతులను రాజులుగా చేయడమే లక్ష్యంగా 'రైతన్న మీ కోసం' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని అచ్చెన్నాయుడు తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రి టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా వ్యవసాయ రంగాన్ని గుర్తించామన్నారు. యువత వ్యవసాయం వైపు మళ్లాలంటే రంగం లాభదాయకంగా మారాలని మంత్రి చెప్పుకొచ్చారు. అధిక పోషక విలువలు ఉండే పంటల సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం కల్పిస్తామని చెప్పారు. దేశ వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ వాటా 10 శాతం ఉందని, 11 పంటలను గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించామని వెల్లడించారు. వ్యవసాయ రంగం వృద్ధి రేటు 7.83 శాతం సాధించిందని తెలిపారు. పంటలను కాపాడేందుకు రైతులకు అన్ని విధాలుగా సాయం అందిస్తామని తెలిపారు. సాగునీటి సౌకర్యాల కల్పనకు బిందు సేద్యంపై ప్రత్యేక దృష్టి



సారిస్తున్నామన్నారు మంత్రి. ప్రభుత్వం రైతులకు వివిధ రూపాల్లో సాయం అందిస్తోందని వివరించారు. 24 గంటల్లో 9 వేల కోట్ల రూపాయలకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. పీఎం కిసాన్ పథకం కింద రూ.6,309 కోట్లు చెల్లించామన్నారు. 2026-27లో దానిని రూ.6,600 కోట్లకు పెంచామని చెప్పారు. ధాన్యం సేకరణ బకాయిలుగా రూ.1,674 కోట్లు చెల్లించామని తెలిపారు. భూసార పరీక్షల ద్వారా 6 లక్షల భూసార పరీక్ష పత్రాలు అందజేశామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంతో 18 లక్షల మంది రైతులకు విస్తరణ

మిగతా 2వ పేజీలో..

# 16న ఎపికి వస్తున్న బిల్‌గేట్స్

### మూడుసార్లు ఎపికి రప్పించిన ఘనత నాదే

### సంజీవిని పథకం వస్తున్నారని వెల్లడించిన చంద్రబాబు

**అమరావతి,ఫిబ్రవరి14 (చట్టం న్యూస్):** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ 16న సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శనివారం అమరావతిలో పార్టీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన భేటీలో సీఎం చంద్రబాబు ఈ విషయం వెల్లడించారు. 'ఎల్లుండి అమరావతికి బిల్ గేట్స్ వస్తున్నారు. బిల్ గేట్స్‌ను 3 సార్లు ఏపీకి తీసుకొచ్చిన ఘనత నాదే' అని సగర్వంగా ప్రకటించారు. తొలిసారి హైటెక్ సిటీ (హైదరాబాద్) కోసం, రెండోసారి విశాఖ అగ్రిటెక్ కోసం గేట్స్‌ను రప్పించానని, ఇప్పుడు సంజీవని పథకం కోసం పిలిపిస్తున్నామని వివరించారు. ఆరోగ్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చే లక్ష్యంతో సంజీవని పథకం రూపొందుతోంది. బిల్ / మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఈ పథకం ద్వారా గ్రామీణ ఆరోగ్య సేవలు, వ్యాక్సినేషన్, మాతా శిశు సంరక్షణ వంటి అంశాల్లో పురోగతి సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, సంజీవని పథకం అనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 2025లో ప్రవేశపెట్టిన టెక్నాలజీ ఆధారిత ప్రజా ఆరోగ్య కార్యక్రమం. ఇది రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్'గా మార్చడం, ప్రతి పౌరుడికీ డిజిటల్ హెల్త్ రికార్డులు, ముందస్తు రోగ నిర్ధారణ, ఉచిత, సులభ వైద్య సేవలు అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. డిజిటల్ హెల్త్ రికార్డులు: సంజీవని పథకం కింద ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొ÷ల్/డిజిటల్ హెల్త్ కార్డ్ ఇస్తారు. ఇందులో వైద్య పరీక్షలు, చికిత్స చరిత్ర, ప్రిస్క్రిప్షన్లు, ల్యాబ్ రిపోర్టులు, వ్యాక్సినేషన్ రికార్డులు



స్టోర్ అవుతాయి. మొబైల్ ఫోన్ ద్వారా డాక్టర్ అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవచ్చు. క్యాష్‌లెస్, పేపర్‌లెస్ మాత్రమే కాకుండా తక్షణ సాయం అందుతుంది. ప్రతి కుటుంబానికీ సంవత్సరానికి రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స (యూనివర్సల్ హెల్త్ కవరేజ్). అవసరమైతే ట్రస్ట్ ద్వారా అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్ కోసం రూ.25 లక్షల వరకు సాయం అందించనున్నారు. ముందుగానే రోగాలను గుర్తించడం. ఉదాహరణకు 30 ఏళ్లు దాటిన వారికి, హై-రిస్క్ కేసులకు స్క్రీనింగ్. రాష్ట్రవ్యాప్తంగా 72.73 లక్షల మందికి 42 రకాల వైద్య పరీక్షలు (రక్త పరీక్షలు,

మిగతా 2వ పేజీలో..

## రైతుల సంఘాల పేరుతో రాహుల్ భేటీ కృత్రిమం

### రంగస్థలం నిర్వహించారంటూ కేంద్రమంత్రి విమర్శలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి14 (చట్టం న్యూస్):** లోక్‌సభ ఆవరణలో రైతు సంఘాల నేతలతో శుక్రవారం కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సమావేశమైన సంగతి తెలిసిందే. పార్లమెంట్ భవన సముదాయంలో జరిగిన ఈ భేటీలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం, రైతులు, రైతు కూలీల జీవనోపాధిని కాపాడడంపై చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో రైతులతో రాహుల్ భేటీ.. నకిలీ సమావేశం అంటూ బీజేపీ నేతలు విమర్శించారు. రాహుల్ నిర్వహించిన మీటింగ్ కృత్రిమమైనది, అలానే ఆధారం లేనిదంటూ బీజేపీ నేతలు మండిపడుతున్నారు. శనివారం 'ఎక్స్' వేదికగా కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వీడియోను రిలీజ్ చేశారు. 'రాహుల్ గాంధీ మరోసారి రంగస్థలం నిర్వహించాడు. ఆయన నిర్వహించిన సమావేశం అత్యంత కృత్రిమమైనదిగా ఉంది. అలాగే దీని ద్వారా నకిలీ కథనాన్ని బయటపెట్టారు. ఈ సమావేశంలో కొందరు కాంగ్రెస్ నేతలు రైతులుగా నటించారు. వారితో రాహుల్ గాంధీ నకిలీ సంభాషణ నిర్వహించారు. రైతుల ప్రయోజనాలను ప్రధాని మోదీ పూర్తిగా రక్షించినా కూడా.. అమాయకపు రైతులను తప్పు దోవ పట్టించేందుకు రాహుల్ గాంధీ, ఆయన స్నేహితులు ఇలాంటి నకిలీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. వీరి నిజ స్వరూపాన్ని బయటపెడతాను' అని గోయల్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అబద్ధాలని, నిజమైన రైతులను ఆందోళనకు గురి చేస్తుందని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. శుక్రవారం రాహుల్‌తో జరిగిన

మిగతా 2వ పేజీలో..

## పార్టీ నేతలతో లోకేశ్ విందు సమావేశం

### విజయవాడ, గుంటూరు నేతలతో భేటీ ఆత్మీయంగా పలకరింపులు..

**అమరావతి,ఫిబ్రవరి14 :** రాజకీయ వ్యూహాలు, అసెంబ్లీ బడ్జెట చర్చల బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ.. మంత్రి నారా లోకేష్ ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం ఉండవల్లిలోని.. ఆయన నివాసంలో గుంటూరు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం

మిగతా 2వ పేజీలో..



## జాతీయ రహదారిపై విమాన ల్యాండింగ్ సౌకర్యం

### అసోంలో ల్యాండ్ అయిన ప్రధాని మోడీ విమానం

గౌహతి,ఫిబ్రవరి14 : భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. అస్సాం పర్యటన నిమిత్తం అక్కడకు చేరుకున్నారు. దిబ్రూగఢ్ - మోరాన్ జాతీయ రహదారిపై నిర్మించిన అత్యవసర ల్యాండింగ్ ఫెసిలిటీ రోడ్డుపై మోదీ ప్రయాణించిన ప్రత్యేక విమానం దిగింది. దీంతో అస్సాంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైనట్టయింది. ఆ తర్వాత..

మిగతా 2వ పేజీలో..



# ఎక్కువ మంది విద్యార్థులకు అసెంబ్లీ చూసే ఛాన్స్

### వారిలో అవగాహన కోసమే కార్యక్రమం: స్పీకర్

**అమరావతి,ఫిబ్రవరి14 (చట్టం న్యూస్):** విద్యార్థులకు అసెంబ్లీని చూసే అవకాశం కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. శనివారం అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మీడియాతో స్పీకర్ మాటామంతి నిర్వహించారు. ఇప్పటివరకు 700 మందికి పైగా విద్యార్థులు అసెంబ్లీని వీక్షించారని సభాపతి తెలిపారు. మరో రెండు రోజుల్లోనే 200లకు పైగా పాఠశాలల నుంచి దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వీలైనంత ఎక్కువ మంది విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీని చూసిన కొంతమంది విద్యార్థులు.. తాము భవిష్యత్తులో ఎమ్మెల్యేలు అవుతామనే ఆకాంక్ష వ్యక్తం చేస్తున్నారని స్పీకర్ ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్లు, ఇంజినీర్లు కావడమే కాకుండా నేటితరం విద్యార్థులు రాజకీయాలపై ఆలోచించాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు అసెంబ్లీ చూసే అవకాశం కల్పించడం వెనుక ఉద్దేశం నెరవేరుతున్నందుకు తృప్తిగా ఉందన్నారు. పాఠశాలల్లో మాక్ అసెంబ్లీల నిర్వహణ పెరగడం శుభపరిణామమని స్పీకర్ కొనియాడారు.

గత రాత్రి మంత్రి నారా లోకేశ్‌తో జరిగిన సమావేశం ఆత్మీయ వాతావరణంలో సాగిందని చెప్పారు. అందరూ ఒక కుటుంబ సభ్యుల్లా సరదాగా గడిపామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాటించే డైట్ పాటిస్తే ఎవరైనా బరువు తగ్గిపోతారని తెలిపారు. మంత్రి లోకేశ్ ఇప్పటికే బాగా తగ్గారని, ఇంకా ఎక్కువ తగ్గొద్దని సూచించానని స్పీకర్ వ్యాఖ్యానించారు. మంత్రి అచ్చెన్నాయుడు కూడా



ఎక్కువగా బరువు తగ్గారని, అది మంచిది కాదని హెచ్చరించానని ఆయన చెప్పారు.

# 16న ఎపికి వస్తున్న బిల్‌గేట్స్

మొదటి పేజి తరువాయి..

డయాబెటిస్, , గుండె సంబంధిత వంటివి) చేస్తారు.

**ఎఐఆధారిత స్క్రీనింగ్, పర్సనలైజ్డ్ మెడిసిన్ కార్యక్రమాన్ని బిల్ / మెలిండా గేట్స్ ఫౌండేషన్, టాటా**

కన్‌స్టలెన్సీ సర్వీసెస్ సహకారంతో అమలు చేస్తున్నారు. ఇది ఆయుష్మాన్ భారత్, హెల్త్ సర్వీసెస్‌తో ఇంటిగ్రేట్ అవుతుంది. అమరావతి రాజధాని ప్రాంతంగా ఉండటంతో.. సంజీవని పథకం ఇక్కడ ప్రధానంగా అమలు చేయాలని చూస్తున్నారు. బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులు, పర్సనలైజ్డ్ మెడిసిన్ వంటి అంశాలు అమరావతిలో ఫోకస్ చేస్తున్నారు. బిల్ గేట్స్ తన పర్యటనలో (ఫిబ్రవరి 16) అమరావతికి వచ్చి ఈ పథకంపై చర్చలు జరుపుతారు. ఇది అమరావతిని హెల్త్‌కేర్ / టెక్నాలజీ హబ్‌గా మార్చే భాగంగా చూస్తున్నారు. మొదటి పైలట్ ప్రోగ్రాం కుప్పం నియోజకవర్గంలో విజయవంతంగా ప్రారంభమైంది. తర్వాత 2026 జనవరి నుంచి చిత్తూరు జిల్లా మొత్తం అమల్లోకి తెచ్చారు. 2026లో రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా అమలు చేస్తారు. జూలై 2026 నాటికి లక్షల మంది స్క్రీనింగ్ పూర్తి చేసి, ఆరోగ్య భద్రతను బలోపేతం చేయాలనేది ఈ పథకం లక్ష్యం. ఈ పథకం రాష్ట్ర ప్రజలకు ఆర్థిక భారం తగ్గించి, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి తెచ్చే 'గేమ్ ఛేంజర్'గా చెబుతున్నారు.



# సేవాతీర్థ్ ప్రారంభంపై చంద్రబాబు అభినందనలు

మొదటి పేజి తరువాయి..

ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది కేంద్ర ప్రభుత్వం. ఈ చరిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఎక్స్' వేదికగా ప్రధానికి, కేంద్ర ప్రభుత్వానికి తన అభినందనలు తెలియజేశారు.

# శ్రీశైలంలో వైభవంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

మొదటి పేజి తరువాయి..

పుష్పాలతో దేదీప్యమానంగా సర్వాంగ సుందరంగా తయారుచేసిన పుష్పపల్లకిలో శ్రీస్వామి అమ్మవార్లు గ్రామోత్సవంలో భక్తులను కనువిందు చేశారు గంగాధర మండపం దగ్గర పుష్పపల్లకిలో ఉన్న శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక హారతులిచ్చి అనంతరం అంకాలమ్మ గుడి,నంది మండపం బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు శ్రీస్వామి అమ్మవార్ల గ్రామోత్సవం కన్నులపండువగా సాగింది. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు పుష్పపల్లకిపై ఉన్న శ్రీస్వామి అమ్మవార్లను భక్తులు
దర్శించుకుని కర్పూర నీరాజనాలర్పించారు శ్రీశైల క్షేత్రమంత శివనామస్మరణతో మారుమ్రోగింది....

# రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు కేబినేట్ ఆమోదం

మొదటి పేజి తరువాయి..

సేవలు అందించామని పేర్కొన్నారు. పెట్టుబడి రాయితీ కింద రూ.310 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. యాంత్రీకరణలో 50 శాతం రాయితీతో రూ.136 కోట్లు కేటాయించామని వివరించారు. 80 శాతం రాయితీతో రూ.90.4 కోట్లతో.. 1,130 డ్రోన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గతేడాది రూ.182 కోట్ల రాయితీతో విత్తనాల సరఫరా చేశామని మంత్రి పేర్కొన్నారు.

# పార్టీ నేతలతో లోకేశ్ విందు సమావేశం



మొదటి పేజి తరువాయి..

వనభోజనాల తరహాలో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగింది. రాజకీయ చర్చలకు తావులేకుండా, కేవలం కుటుంబ విషయాలు, పిల్లల చదువులు, వారికి గల క్రీడాభిలాషపై మాట్లాడుకున్నారు. సమావేశానికి వచ్చిన చిన్నపిల్లలతో లోకేష్ సరదాగా కబుర్లు చెబుతూ గడిపారు. చదువు, కెరీర్ ఒక్కటే జీవితం కాదు..పిల్లలు క్రీడలను కూడా కెరీర్‌గా ఎంచుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి' అని లోకేష్ ఈ సందర్భంగా సూచించారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని చేనేత కార్మికులకు అండగా నిలిచేందుకు లోకేష్ ప్రతి అవకాశాన్నీ వాడుకుంటున్నారు. ఈ సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా మంగళగిరి చేనేత చీరలను కానుకగా అందజేసి తన నియోజకవర్గ బ్రాండింగ్‌ను చాటుకున్నారు. కేవలం విందుకే పరిమితం కాకుండా.. బాధ్యతాయుతమైన నాయకుడిగా లోకేష్ మరో అడుగు వేశారు. గతంలో ఆయా నియోజకవర్గాల నాయకులు తనకు ఇచ్చిన వినతులపై తాజా పరిస్థితి ఏంటి? పనులు ఏ దశలో ఉన్నాయి? అనే అంశాలతో కూడిన స్టేటస్ రిపోర్టులను స్వయంగా ఆయా నాయకులకు అందజేశారు. ఈ విందులో గుంటూరు ఎంపీ / కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ (తెనాలి-జనసేన), ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్ (తాడికొండ),ధూళిపాళ్ల నరేంద్రకుమార్ (పొన్నూరు),బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు),
గల్లా మాధవి (గుంటూరు వెస్ట్),నసీర్ అహ్మద్ (గుంటూరు ఈస్ట్),ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్
విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని),తంగిరాల సౌమ్య (నందిగామ),శ్రీరాం రాజగోపాల్ (జగ్గయ్యపేట),వసంత వెంకట కృష్ణప్రసాద్ (మైలవరం),కొలికపూడి శ్రీనివాసరావు (తిరువూరు)
బొండా ఉమామహేశ్వరరావు (విజయవాడ సెంట్రల్),గద్దె రామమోహన రావు (విజయవాడ ఈస్ట్)
ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ వీరిలో ఉన్నారు.


# రైతుల సంఘాల పేరుతో రాహుల్ భేటీ కృత్రిమం

మొదటి పేజి తరువాయి..

సమావేశంలో అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని రైతు సంఘాల నేతలు వ్యతిరేకించారు. మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, పండ్లు, పప్పు ధాన్యాల రైతుల బతుకుదెరువు.. ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఈ ఒప్పందంతో దేశంలోకి వ్యవసాయ దిగుమతులకు తలుపులు తెరుచుకుంటాయని.. ఇతర పంటలు కూడా భారత్‌లోకి ప్రవేశిస్తాయని రాహుల్ వారికి చెప్పారని కాంగ్రెస్ ఓ ప్రకటనలో వెల్లడించింది.

# జాతీయ రహదారిపై విమాన ల్యాండింగ్ సౌకర్యం


మొదటి పేజి తరువాయి..



మోదీ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఏర్పాటుచేసిన యుద్ధ, రవాణా, ఎయిర్‌క్రాఫ్ట్‌ల వైమానిక ప్రదర్శనను వీక్షించారు. ఈ ఈఎల్ఎఫ్ గురించి ఎక్స్ వేదికగా ప్రత్యేక పోస్ట్ చేశారు. క్లిష్ట సమయంలో సహాయ కార్యకలాపాలకు, అత్యవసర ప్రతిస్పందనకు ఈ ఫెసిలిటీ కీలకం కానుందని పేర్కొన్నారు మోదీ. ఈశాన్య భారతదేశంలో ఏర్పాటుచేసిన ఈ ఎమ్జ్గ÷న్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ(ఇఒఈ).. చైనా సరిహద్దుకు 300 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇటీవల నిర్మించిన 4.2 కిలోమీటర్ల ఈ హైవేపై రఫేల్, సుఖోయ్ వంటి యుద్ధ విమానాలను ల్యాండ్ చేయవచ్చు. అంతేకాకుండా.. అత్యవసర పరిస్థితుల్లో సైనిక, పౌర విమానాలను దింపేందుకూ ఇది ఉపయుక్తం కానుంది. దిబ్రూగఢ్ ఎయిర్‌పోర్ట్, చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్లలో కార్యకలాపాలు నిర్వహించలేని సందర్భాల్లో దీనిని ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకోవచ్చు.దీంతో సరిహద్దు ప్రాంతాల్లో ఏమైనా ఉద్రిక్తతలు నెలకొన్నప్పుడు.. భారత వాయుసేన వేగంగా స్పందించేందుకూ మార్గం సుగమం కానుంది. టేకాఫ్, ల్యాండింగ్ రెండింటికీ అనుకూలంగా ఈ ఫెసిలిటీని డిజైన్ చేశారు. పశ్చిమ, ఉత్తర, మధ్య భారతంలో ఇప్పటికే ఈ ఈఎల్ఎఫ్‌లు ఉన్నాయి.

# సిద్ధార్థ విద్యా సంస్థలలో సంస్కృతి- 2026





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 14,( చట్టం బ్యూరో) :** కరీంనగర్ లోని సిద్ధార్థ విద్యాసంస్థలు స్థాపించి 30 సంవత్సరాలు పురస్కరించుకున్న సందర్భంగా సంస్కృతి-2026 పేరుతో రెసిడెన్షియల్ క్యాంపస్ విద్యార్థులకు రంగినేని గార్డెన్నందు అంగరంగ వైభవంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి , డైరెక్టర్ దాసరి స్వప్న శ్రీపాల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ఆరంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులందరూ ఈ వేడుకలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి బహుమతి ప్రధానం చేసారు. విద్యార్థులు ప్రదర్శించిన అష్టలక్ష్మి వైభవం, భక్త ప్రహ్లాద, రామాయణం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు చిన్నతనం నుండే చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలని, వారు మంచిమార్గంలో రాణించడానికై తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని అన్నారు. ఈ కార్యక్రమం సంవత్సరం పొడవునా విద్యార్థులు సాధించిన ప్రతిభ, కృషి, క్రమశిక్షణ మరియు విలువల ప్రదర్శనకు ఒక వేదిక అని ప్రత్యేకంగా హాస్టల్ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ తమ ప్రతిభను మెరుగుపరుచుకుంటున్నారని, ఇంటి నుండి దూరంగా ఉండి కూడా, పిల్లలు చూపుతున్న ఆత్మవిశ్వాసం, పట్టుదల మరియు నిబద్ధత మాకు గర్వకారణమని పిల్లల విజయంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమైనది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఆశిస్సులు మరియు విశ్వాసం వారికి మరింత ధైర్యం మరియు ఉత్తేజాన్ని ఇస్తాయని తల్లిదండ్రులను ఉద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి, డైరెక్టర్ దాసరి స్వప్న శ్రీపాల్ రెడ్డి గారు, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఏదులాపురం చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలి

- **అధిక సీట్లు.. ఎక్కువ ఓట్లు కలిగి ఉన్నవి మాదిగలవే**
- **విలేకరుల సమావేశంలో ఎం ఆర్ పి ఎస్ జిల్లా కార్యదర్శి కనకం జనార్ధన్ మాదిగ విజ్ఞప్తి**



**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) ఫిబ్రవరి 14 :** ఏదులాపురం చైర్మన్ పదవి ఎస్సీలకు రిజర్వు చేయబడిందని, ఏదులాపురం మున్సిపల్ ఎన్నికలలో ఎస్సీ మాదిగలు నాలుగు సీట్లు గెలుచుకున్నారని, ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు సభ్యులు గెలుపొందారని అధిక స్థానాలు దక్కించుకున్న మాదిగలకు చైర్మన్ పదవి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ , ఎం ఎస్ పి జిల్లా కార్యదర్శి, ఖమ్మం రూరల్ మండల ఇన్చార్జి కనకం జనార్ధన్ మాదిగ కోరారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏదులాపురం మున్సిపాలిటీలోనూ, పాలేరు.నియోజకవర్గంలోనూ జిల్లా లోను అటు రాష్ట్రంలోనూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓటు బ్యాంకింగ్ జనాభా అత్యధికంగా ఉందని, రిజర్వేషన్ల ప్రాతిపదికన తమ సామాజిక వర్గానికి ఏదులాపురం మున్సిపల్ చైర్మన్ పదవి దక్కే అవకాశం ఉందని, కానీ జరుగుతున్న పరిణామాలు అందుకు భిన్నంగా ఆందోళనకరంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలలో ఎక్కువ స్థానాలు మాదిగ సామాజిక వర్గానికి చెందినవారు గెలుపొందారని అటువంటి వారికి కాదని మరొకరికి కట్ట పెట్టాలనే ప్రయత్నాలు మంచిది కాదని అన్నారు.
రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మాదిగ సామాజిక వర్గం అక్కున చేర్చుకొని అండదండగా నిల్చారని, ఏ ఎన్నిక వచ్చిన, పార్టీకి ఎంత కష్టం వచ్చినా దశాబ్దాల తరబడి వెన్నంటే నిలిచారని అటువంటివారిని కాదని మరొక సామాజిక వర్గానికి ఇవ్వాలనే ప్రయత్నాలు మంచి పరిణామం కాదని అన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకొని న్యాయబద్ధంగా మాదిగలకు దక్కే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్ల లోను, ఓటు బ్యాంకింగ్ లోను, జనాభా లోను మున్సిపల్ ఎన్నికల్లో అధిక స్థానాలు మాదిగ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులే విజయం సాధించారని అటువంటి వారికే చైర్మన్ పదవి కేటాయించాలని కోరారు.
ఈ సందర్భంగా ఎస్సీ ఉపకులం డక్కల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్నే రామారావు మాట్లాడుతూ.. ఏదులాపురం మున్సిపాలిటీ అదేవిధంగా పాలేరు నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు రిజర్వేషన్ల ప్రాతిపదికన మాదిగలకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దయతో ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# మహానందికి పోటెత్తిన భక్తులు

మహానంది,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నంద్యాల జిల్లా మహానంది పుణ్యక్షేత్రానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మహానందిలోని పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. అనంతరం గంగా కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయ ఈవో నల్ల కాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పండితుల వేదమంత్రాల నడుమ మహానంది క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ఆస్పత్రి నుంచి మహిళ అదృశ్యం

## కుటుంబ సభ్యుల తీవ్ర ఆందోళన

హైదరాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ బాచుపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నుంచి మహిళ అదృశ్యమైన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. వికారాబాద్ జిల్లా యాలాల మండలం, కిష్టాపూర్ గ్రామానికి చెందిన పల్లె అనంతమ్మ (56) గత వారం రోజుల క్రితం ఈ హాస్పిటల్ నుంచి కనిపించకుండా పోయింది. ఇప్పటి వరకు ఆమె ఆచూకీ లభించలేదు. జనవరి 29న కిష్టాపూర్ గ్రామంలో హాస్పిటల్ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత చికిత్స పేరుతో జనవరి 30న కంటి ఆపరేషన్ కోసం గ్రామస్తులను బస్సులో బాచుపల్లి హాస్పిటల్‌కు తరలించారు. కిష్టాపూర్ నుంచి 10 నుండి 15 మంది వెళ్లగా.. అంతా తిరిగి వచ్చారు. కానీ అనంతమ్మ మాత్రం తిరిగి రాలేదు. హాస్పిటల్ సీసీటీవీ ఫుటేజ్ పరిశీలనలో ఈ నెల 5వ తేదీన అనంతమ్మ హాస్పిటల్ నుంచి బయటకు వెళ్లినట్లు తెలిసింది. హాస్పిటల్ నిర్లక్ష్యం వల్లే.. ఆమె బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే వారం రోజులు గడిచినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'మా అమ్మ మాకు కావాలి' అంటూ హాస్పిటల్ ముందు కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. 'మా అమ్మను ఎలా తీసుకొచ్చారో అలాగే అప్పగించాలి' అని అనంతమ్మ కొడుకు డిమాండ్ చేస్తున్నాడు. మహిళ ఆచూకీ లభించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కుటుంబ సభ్యులు హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేట్టారు.

# కరీంనగర్ మేయర్ పీఠం బిజెపిదే

**కాంగ్రెస్, బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొడుతాం**

**ప్రజాతీర్పును కాలరాసేలా కుట్రలు**

**కేంద్రమంత్రి బండి సంజయ్**



హైదరాబాద్,ఫిబ్రవరి14 : అధికార పార్టీ కాంగ్రెస్‌తో బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు పెట్టుకొని భాజపాని మున్సిపల్ ఎన్నికల్లో ఓడించాలని చూసినా.. ప్రజలు మాత్రం తమని ఆశీర్వదించారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. అత్యధిక స్థానాలు చేజిక్కించుకున్న తామే కరీంనగర్ మేయర్ పీఠం పక్కా ప్లాన్‌తో వ్యూహాత్మకంగా దక్కించుకోబోతున్నామని స్పష్టం చేశారు. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తే.. వారి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం బయట పెడతానని తేల్చి చెప్పారు. ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అనుసంధానకర్తగా ఎంఐఎం పనిచేస్తుందని ఆరోపించారు. కరీంనగర్‌లో కార్యకర్తల కష్టం, ప్రధాని మోదీ ఆశీస్సులతో గెలవడం సంతోషంగా ఉందని కేంద్రమంత్రి హర్షం వ్యక్తం చేశారు. స్వతంత్ర అభ్యర్థులు భాజపాలో చేరారని, మేయర్ పీఠానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ దాటేశామని వెల్లడించారు. మున్సిపల్ పీఠం ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఇప్పటివరకూ రూ.1,400 కోట్ల పనులు చేశామని తెలిపారు. ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను గెలిపించినందుకు కరీంనగర్ ప్రజలకు బండి కృతజ్ఞతలు చెప్పారు. ఎంఐఎం రివైవల్ డే నిర్వహించడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. దేనికోసం రివైవల్ డే చేస్తున్నారని ప్రశ్నించారు. రజాకర్ల రాజ్యం తెస్తారా.. మహిళలను కించపరిచి బతుకమ్మ ఆడిస్తారా.. పాత రాజ్యం తెస్తామని ఎంఐఎం రివైవల్ డే చేస్తుందా? అని నిలదీశారు. వారి ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. ఎంఐఎం ప్రాబల్యం ప్రతి ఎన్నికల్లో తగ్గుతుందని, భాజపా బలపడుతూ వస్తోందని చెప్పారు. రాష్ట్రంలో భాజపా జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. భాజపా అభ్యర్థుల విజయం పట్ల రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.

--------

# అందుబాటులో సమాచారం.. అన్ని సేవలు







- **అన్ని మార్గాలు, రద్దీ ప్రదేశాలు, చోట్ల సైన్ బోర్డ్ లు ఏర్పాటు.**
- **క్యూలైన్లు ఇతర చోట్ల స్టీల్ గ్లాసుల్లో తాగునీటి వసతి**
- **బేబీ ఫీడింగ్ సెంటర్ అందుబాటులోకి..**
- **దివ్యాంగులు, వృద్ధులకు సహాయంగా వీల్ చైర్లు**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 14,( చట్టం బ్యూరో ) :** మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. అన్ని చోట్లా పూర్తి సమాచారం ఏర్పాటు చేశారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక ప్రణాళిక ప్రకారం జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇలా ప్రతి చోట జిల్లా అధికారిని ఇన్చార్జిగా నియమించారు.

అలాగే జాతర పరిసర ప్రాంతాల్లో 10 హెల్ప్ డెస్క్ లు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, సౌకర్యాలు, పారిశుద్ధ్యం, భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లపై ఇప్పటికే రెండు సార్లు సంబంధిత అధికారులతో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశాలు నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు.

### వైద్య శిబిరాలు

భక్తులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అత్యవసర చికిత్స, ప్రాథమిక వైద్య సేవలు, మందుల పంపిణీ కోసం వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అనారోగ్యం, గాయాలు తదితర సమస్యలు తలెత్తిన వెంటనే చికిత్స అందించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. గుడి ఆవరణలో వైద్య సిబ్బంది, అగ్ని మాపక సిబ్బంది ఉన్నారు.

### సూచిక బోర్డులు

భక్తులు దారి తప్పకుండా దర్శన మార్గాలు, క్యూలైన్లు, మరుగుదొడ్లు, త్రాగునీటి కేంద్రాలు, హెల్ప్ డెస్క్‌లను సులభంగా గుర్తించేలా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. తెలుగులో బోర్డులు ఏర్పాటు చేసి భక్తులకు మార్గనిర్దేశం చేస్తున్నారు.

### బేబీ ఫీడింగ్ రూమ్

చిన్న పిల్లలతో వచ్చే తల్లులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా బేబీ ఫీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ గదుల్లో పరిశుభ్రమైన వాతావరణం, గోప్యత, కూర్చునే సదుపాయాలు కల్పించారు. తల్లులు ప్రశాంతంగా పిల్లలకు పాలు ఇవ్వడానికి ఈ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.

### దివ్యాంగుల, వృద్ధుల కోసం వీల్ చైర్లు

దివ్యాంగ,వృద్ధ భక్తులు స్వామివారి దర్శనానికి సులభంగా చేరుకునేలా వీల్ చైర్ సౌకర్యం కల్పించారు. ప్రధాన ప్రవేశ ద్వారాలు, హెల్ప్ డెస్క్‌ల వద్ద వీల్ చైర్లు అందుబాటులో ఉండేలా సిబ్బందిని నియమించారు. అవసరమైన సహాయాన్ని వెంటనే అందించేలా చర్యలు తీసుకున్నారు. దాదాపు 100 వీల్ చైర్లు అందుబాటులో ఉన్నాయి.

### త్రాగునీటి కోసం స్టీల్ గ్లాసులు

భక్తులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు ప్రత్యేకంగా స్టీల్ గ్లాసులను వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఈ ఏర్పాటు చేశారు. అన్ని త్రాగునీటి కేంద్రాలు, క్యూ లైన్లలో గ్లాసుల శుభ్రతపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.

### హెల్ప్ డెస్క్

భక్తుల సమస్యలు, సందేహాలకు వెంటనే స్పందించేందుకు 10 హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. దర్శన సమయాలు, వసతి, వైద్య సహాయం, దివ్యాంగుల సదుపాయాలు తదితర సమాచారం ఇక్కడ పొందవచ్చని అధికారులు తెలిపారు.

### పారిశుధ్య నిర్వహణ

పంచాయితీ, మున్సిపల్ శాఖల సమన్వయంతో దేవస్థానం పరిసరాలు, ప్రధాన రహదారులు, క్యూలైన్లు, మరుగుదొడ్ల వద్ద పారిశుద్ధ్య పనులను విస్తృతంగా చేపట్టారు. చెత్త తొలగింపు, శుభ్రపరిచే పనులు నిరంతరంగా కొనసాగించేలా ప్రత్యేక సిబ్బంది, వాహనాలను నియమించారు. 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

### కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ

జాతర ఏర్పాట్లు, సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సీసీ కెమెరాల సహాయంతో భక్తుల రాకపోకలు, క్యూలైన్లు, భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తూ, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

# మానవతా నాగేశ్వరవు ఇక లేరు

**ఏలూరు జిల్లా ఫిబ్రవరి 14 చట్టం ప్రతినిధి :** ఏలూరు నగరంలో తన ఇంటి పేరుని తాను నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ పేరుగా మార్చుకున్న ఆలపాటి నాగేశ్వరరావు అలియాస్ మానవతా నాగేశ్వరరావు అనుమానాస్పద మృతి చెందారు. ఈ నెల 9వ తేదీన ఉదయం వసంతం మాల్ సెంటర్లో ఆయన నిర్వహిస్తున్న గాయత్రి ఫైనాన్స్ నుండి బయటికి వెళ్తున్న అని బయలుదేరిన ఆయన ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లారు. దీంతో కంగారు పడ్డ ఆయన భార్య టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ ఆయన ఆచూకీ కోసం రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలలో ఆయన నూజివీడు వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఆయన ఆచూకీ కనిపెట్టడం మరింత కష్టమైంది అయితే ఈరోజు ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ గన్నవరం పోలీస్ స్టేషన్ లిమిట్స్ మధ్య ఉన్న చెరువులో ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు



సమాచారం ఇచ్చారు ప్రస్తుతం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించే పనిలో నిమగ్నంగా ఉన్నారు మీ మృతదేహం దొరికిన సమీపంలోనే ఆయన ప్రయాణించిన వాహనం లభించడంతో ఇది ఆయనేనని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గత కొన్ని రోజులుగా అదృశ్యమైన ప్రముఖ స్వచ్ఛంద సేవా నిర్వాహకులు ఆలపాటి నాగేశ్వరరావు (మానవత నాగేశ్వరరావు) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. గన్నవరం - ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఒక చెరువులో ఆయన మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు.

**ఘటన వివరాలు:**

అదృశ్యం: ఈ నెల 9వ తేదీ ఉదయం ఏలూరు వసంతం మాల్ సెంటర్‌లోని తన 'గాయత్రి ఫైనాన్స్' కార్యాలయం నుండి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లిన నాగేశ్వరరావు తిరిగి ఇంటికి చేరుకోలేదు.

**పోలీసుల గాలింపు :**

ఆయన భార్య ఫిర్యాదు మేరకు ఏలూరు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాలు సీసీ కెమెరాల ఆధారంగా గాలింపు చేపట్టగా, ఆయన నూజివీడు వైపు వెళ్తున్నట్లు ఆధారాలు లభించాయి.

**మృతదేహం గుర్తింపు :**

ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఆచూకీ కనుగొనడం కష్టతరమైన తరుణంలో, నేడు గన్నవరం పరిధిలోని ఒక చెరువులో మృతదేహం తేలియాడుతూ కనిపించింది. మృతదేహం సమీపంలోనే ఆయన ప్రయాణించిన ద్విచక్ర వాహనం కూడా లభ్యం కావడంతో, అది నాగేశ్వరరావుదేనని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

తన ఇంటి పేరును సైతం తాను నిర్వహిస్తున్న 'మానవత' సంస్థ పేరుగా మార్చుకుని, ఏలూరులో విశేష సామాజిక సేవలు అందించిన వ్యక్తిగా నాగేశ్వరరావుకు మంచి గుర్తింపు ఉంది. ఆయన మరణవార్తతో ఏలూరులో విషాద ఛాయలు అలముకున్నాయి.

**ప్రస్తుత పరిస్థితి:**

ప్రస్తుతం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఇది ఆత్మహత్యా లేక మరేదైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

# పుల్వామా అమరవీరులకు నివాళి








**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 14 :** ఖమ్మం పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థ త్రివేణిస్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, మరియు యాజమాన్యం శనివారం పుల్వామా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. 2019 ఫిబ్రవరి 14 జమ్ము కాశ్మీర్లో సైనిక బలగాన్ని తీసుకు వెళుతున్న వాహనాల కాన్వాయ్ పై ఉగ్రవాదులకి సంబంధించిన కారుతో ఆత్మాహుతి దాడి జరిపి 40 మంది అమరవీరుల మృతికి కారణమైన ఈ రోజున భారతదేశంలో బ్లాక్ డే గా పిలుచుకుంటారు. ఈ సందర్భంగా త్రివేణి డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ సైనికుల యొక్క గొప్పదనాన్ని వివరించారు, అలాగే వారి మృతికి సంతాప సూచికంగా 2 నిమిషాలు మౌనం పాటించారు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మన దేశ రక్షణకోసం గడ్డకట్టే చలిలో సైతం, తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా,వారి కుటుంబాలను సైతం ఇక్కడే విడిచి పోరాడుతున్న మన సైనికులు నిజమైన హీరోలని, వారి పట్ల మనం ఎప్పుడు గౌరవభావం కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ ,వైస్ ప్రిన్సిపాల్ స్వప్న , ముస్తఫా , క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ మరియు సందీప్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సీతారాంపూర్ 23 వ డివిజన్ లో కార్పొరేటర్ గా ఘన విజయం సాధించిన గుమ్మడి రాజకుమార్



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 14 , ( చట్టం బ్యూరో ) ;** కరీంనగర్ నగరంలోని సీతారాంపూర్ 23 వ డివిజన్ కార్పొరేటర్ గా గుమ్మడి రాజకుమార్ ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనమీద అభిమానంతో ఓట్లు వేసి గెలిపించిన డివిజన్ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. రేపటినుండి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వందలాది మంది అభిమానులు పాల్గొన్నారు.

## పద్మశాలి అభ్యర్థులను గెలిపించిన ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు

**అను మల్ల చంద్రమౌళి కొత్తపెల్లి మాజీ ఉపసర్పంచ్, సామాజిక సేవకులు**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 14,( చట్టం బ్యూరో ) ;** 17వ డివిజన్ 18వ డివిజన్ లలో పద్మశాలి అభ్యర్థులు వేముల కవిత చంద్రశేఖర్ వాసాల రమేష్ లను గెలిపించిన డివిజన్ ఓటర్లకు కొత్తపల్లి మాజీ ఉపసర్పంచ్ సామాజిక సేవకులు అను మల్ల చంద్రమౌళి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. కొత్తపల్లి పట్టణంలో పద్మశాలీలు సత్తా చాటారని తెలిపారు. ఇంతటి ఘన విజయాలకు కృషి చేసిన ప్రతి ఒక్క ఓటరుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## తుమ్మల యుగంధర్‌కి సమస్యల గురించి వివరించిన కూచిపూడి శ్రీనివాస్ చౌదరి



**ఖమ్మం బ్యూరో చట్టం న్యూస్ పిబ్రవరి 14 :** శనివారం 58 డివిజన్ లోని రోడ్డు మరియు ఇతర సమస్యల గురించి యువ నాయకులు తుమ్మల. యుగంధర్ ని స్థానికుల తో కలసి సమస్య లు వివరించి పరిష్కార హామీ ఇప్పించిన కూచిపూడి. శ్రీనివాసచౌదరి

## శివపార్వతుల వేషధారణ



**కొడిమ్యాల, ఫిబ్రవరి 14(చట్టం) :** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండల కేంద్రానికి చెందిన ముమ్మాడి నవీన ఆమె స్నేహితురాలు రమ్య శివపార్వతుల వేషధారణతో వారి భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వారిని అభినందించారు.

## జిల్లా జైలు నందు పగడాల నాగరాజును కలిసి పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ.

**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 14 :** మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఖమ్మం జిల్లా జైలు నందు నగర అధ్యక్షుడు పగడాల నాగరాజును కలిసి దైర్యం చెప్పారు.ఇటీవల జరిగిన నిరసన ధర్నా కార్యక్రమంలో అరెస్ట్ చేయడం జరిగింది.14 రోజులుగా రిమాండ్ లో ఉండగా త్వరలో బెయిల్ వస్తుందని దైర్యంగా ఉండమని భరోసా ఇచ్చారు. వారితో పాటు నాయకులు కూరాకుల నాఘభూషణం, అర్జేసి కృష్ణ,మక్బుల్, భీరెడ్డి నాగచంద్రారెడ్డి,బచ్చు విజయ్ కుమార్,బిక్కసాని జస్వంత్,బత్తుల మురళి,కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో మారుతున్న సమీకరణాలు

- హంగ్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ నజర్
- కనీసం 20 కైవసం చేసుకునేలా కసరత్తు
- మంత్రులు, పార్టీ నేతలతో సిఎం రేవంత్ సమీక్ష
- ఆయారామ్ గయారామ్ ల హడావిడి
- సిఎం రేవంత్‌తో భేటీ అయిన వడ్డేపట్టి కౌన్సిలర్లు

హైదరాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల ఫలితాల తరవాత సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మరోవైపు ఛైర్మన్లు, వైఎస్ ఛైర్మన్ల ఎంన్నికపై అనుసరించాల్సిన వ్యూహంపై సిఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. ప్రధానంగా రాష్ట్రంలో హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో స్వతంత్ర అభ్యర్థులే కీలకంగా మారనున్నారు. మ్యాజిక్ ఫిగర్ దాటని మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్‌లోని సిఎం క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు.. తదుపరి కార్యాచరణపై చర్చించారని సమాచారం. ప్రధానంగా 38 హంగ్ మున్సిపాలిటీలపై చర్చ జరగనుంది. వీటిలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునేలా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. 20కిపైగా హంగ్ మున్సిపాలిటీలు 'హస్త'గతం అవుతాయని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. ఈ సమావేశానికి పలువురు సీనియర్ నేతలూ హాజరయ్యారు. ఇకపోతే తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎన్నికల్లో గెలిచిన పలువురు స్వతంత్ర అభ్యర్థులు తమకు నచ్చిన పార్టీల్లో చేరుతున్నారు. ఇంద్రేశం మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ లావణ్య, ఇస్నాపూర్ 10వ వార్డు కౌన్సిలర్ రాహుల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. మరోవైపు నారాయణపేట పదో వార్డు స్వతంత్ర కౌన్సిలర్ జయశ్రీ భాజపాలో చేరారు. హైదరాబాద్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు సమక్షంలో కాషాయం కండువా కప్పుకొన్నారు. నారాయణపేటలో మొత్తం 24 స్థానాలకు భాజపా 11 స్థానాలు గెలుచుకుంది. స్వతంత్ర అభ్యర్థి చేరికతో భాజపా సభ్యుల సంఖ్య 12కి చేరింది. దీంతో నారాయణపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికలో ఎక్స్ అఫిషియో ఓటు కీలకం కానుంది. ఇప్పటికే బెల్లంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, భాజపాకు చెందిన ఒక కౌన్సిలర్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అక్కడ మొత్తం 34 స్థానాలు ఉండగా.. కాంగ్రెస్‌కు 14, బీఆర్ఎస్‌కు 14, స్వతంత్రులకు 5, భాజపాకు 1 స్థానం దక్కాయి. దీంతో ఆ పార్టీ బలం 17కు చేరింది. ఈ నెల 16న ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. మరోవైపు జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో కౌన్సిలర్లు కుర్వ పావని, శారద, మంజుల, యుగేందర్‌రెడ్డి, దేవమ్మ, విజయ్‌భాస్కర్, జయశ్రీ, తిమ్మప్ప నగరానికి చేరుకొని సీఎంతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో కౌన్సిలర్లు మాట్లాడుతూ.. తాము కాంగ్రెస్ పార్టీలో చేరట్లేదని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే సీఎంను కలిసినట్లు చెప్పారు. తెలంగాణ జాగృతి పార్వర్డ్ బ్లాక్ ద్వారా పోటీ చేసింది. అయితే అభివృద్ధికి సహకరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# బిజెపితో బిఆర్ఎస్ పొత్తులకు తెర

**తోకపార్టీలకే తోక పార్టీగా మారిన బిఆర్ఎస్**
**సిపిఐకి మద్దతు ఇస్తామనడమే ఇందుకు నిదర్శనం**
**మీడియాతో జాగృతి అధ్యక్షురాలు కవిత**



హైదరాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు తొలి అడుగు పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కంచుకోట ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ బలహీన పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని అన్నారు. కమ్యూనిస్టులను తోక పార్టీగా అభివర్ణించిన బీఆర్ఎస్.. ఇప్పుడు సీపీఐకు మద్దతు ఇస్తానంటోందని వ్యాఖ్యలు చేశారు. తోక పార్టీలకే.. బీఆర్ఎస్ తోక పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. సీపీఐ అడగకుండానే.. కొత్తగూడెంలో సీపీఐకు కేటీఆర్ ఓపెన్ ఆఫర్ ఇవ్వటం దిగజారుడే అని చెప్పుకొచ్చారు. కేసీఆర్, బీఆర్ఎస్‌ను అసెంబ్లీలో కూనంనేని సాంబశివరావు ఎన్ని మాటలు అన్నారో కేటీఆర్‌కు గుర్తు లేదా అని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని ఆరోపణలను కేటీఆర్ ఒప్పుకున్నట్లేనా అని కవిత నిలదీశారు. కార్మికుల కోసం సీపీఐకు మద్దతు అంటోన్న కేటీఆర్ నయ వంచన చేసుకుంటున్నారని అన్నారు. అవసరం వచ్చినప్పుడు.. బీఆర్ఎస్‌కు కార్మికులు గుర్తొస్తారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని మున్సిపల్ ఫలితాలు చెప్తున్నాయన్నారు. మున్సిపాలిటీలను తీర్చిదిద్దానని చెప్పుకుంటోన్న కేటీఆర్.. ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ఈ స్థానాలు రావడమే ఎక్కువ అన్నట్లు కేటీఆర్ మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. 'నేనే రాజు నేనే మంత్రి.. సీఎం పదవి ఆరు నెలలు బోనస్' అంటోన్న రేవంత్.. రైతుల బోనస్ గురించి మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు. జాగృతిపై కామెంట్స్ చేస్తోన్న వారికి చెప్తున్న.. ఇది జస్ట్ ట్రైలర్.. పిక్చర్ బాకీ హై' అని అన్నారు కవిత. కరీంనగర్ కార్పొరేషన్ కోసం బీజేపీ అష్టకష్టాలు పడుతోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో తప్ప బీజేపీ ఎక్కడా లేదన్నారు. సింగరేణి ఎన్నికల్లో కూడా ఏఐఎఫ్‌బీతో కలిసి జాగృతి పోటీ చేస్తుందని ప్రకటించారు. 40కి పైగా స్థానాల్లో జాగృతి, ఏఐఎఫ్‌బీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు కవిత. వడ్డేపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రలోభాలకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎవరికి మద్దతివ్వాలో స్థానిక జాగృతి నేతలు డిసైడ్ చేసుకుంటారని తెలిపారు. చట్టాలను ఉల్లంఘించి ప్రభుత్వ సొమ్ముతో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారని కవిత ఆరోపించారు. గతంలో 90 శాతం గెలిచిన బీఆర్ఎస్.. 17 సీట్లకు పడిపోవటం దారుణమన్నారు. ఉత్తర తెలంగాణలో బీజేపీకి మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ ముందే డిసైడ్ అయిందని కవిత వ్యాఖ్యలు చేశారు.

--------

# మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

**ఇవి స్థానిక రాజకీయాల ఆధారంగా జరిగినవే**
**అయినా గణనీయంగా తమ బలాన్ని పెంచుకున్నాం**
**మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**

**హైదరాబాద్,ఫిబ్రవరి14**: తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫలితాలే దీనికి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గణనీయంగా మెరుగుపడిందని కేటీఆర్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్స్‌అఫీషియో ఓట్ల నమోదు విషయంలో సీఎస్, రాష్ట్ర ఎన్నికల సంఘంతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ 30 మున్సిపాలిటీలకు పైగా సులువుగా గెలుచుకుంటుందని అనుకున్నప్పటికీ, కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. హంగ్ వచ్చిన ప్రాంతాల్లో కూడా పరిస్థితి తమకు అనుకూలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన మేర మున్సిపాలిటీలు రాలేదని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో మినహాయించి బీజేపీ ప్రభావం ఎక్కడా అంతగా లేదని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయని తెలిపారు. ఫార్ములా కేసులో ఏమీ లేదని ఏసీబీ అధికారులే చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా-ఈ, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు ఐదుసార్లు విచారణకు పిలిచారని, మళ్లీ పిలిస్తే వెళ్తానని చెప్పారు. ప్రభుత్వం అరెస్టు చేయాలనుకుంటే అరెస్ట్ అవుతానని ఆయన వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులకు స్పష్టమైన సందేశం ఇవ్వాలనే ఆలోచనతోనే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని చెప్పినట్లు కేటీఆర్ వెల్లడించారు.

# చక్రం తిప్పిన పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

**కామారెడ్డిలో హంగ్‌తో అస్పష్టత**

నిజామాబాద్,ఫిబ్రవరి14 : టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సొంత మండలం భీంగల్‌లో చక్రం తిప్పారు. రెండు రోజుల ముందు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దీంతో ప్రజాపాలనకు జనం జైకొట్టారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి భీంగల్ మున్సిపాలిటీని సవాల్‌గా తీసుకున్నా సక్సెస్ కాలేకపోయారు. బీఆర్ఎస్ నాలుగు స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆర్మూర్ మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగరేయడానికి ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సర్వశక్తులు ఒడ్డినా 8 చోట్ల మాత్రమే గెలుపు సాధించగలిగారు. 19 స్థానాలు దక్కించుకొని కాంగ్రెస్ మ్యాజిక్ ఫిగర్ సొంతం చేసుకుంది. రెబెల్స్ పోటీలో లేకుంటే మరో మూడు వార్డులు కాంగ్రెస్ కు దక్కేవి. బీఆర్ఎస్ 5 స్థానాలు, మజ్లిస్ ఒక చోట గెలువగా ఇండిపెండెంట్‌లుగా పోటీ చేసిన ముగ్గురు రెబెల్స్ విజయం సాధించారు. 38 వార్డులున్న బోధన్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ 17 వార్డులు కైవసం చేసుకుంది. రెబెల్స్‌తో కొన్ని వార్డుల్లో పార్టీకి నష్టం వాటిల్లింది. మజ్లిస్ గత వైభవాన్ని చాటుతూ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 3 వార్డులకే పరిమితమైంది. బీఆర్?ఎస్? ఐదు వార్డులు గెలువగా కాంగ్రెస్ రెబెల్ ఒకచోట విజయం సాధించారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్‌కుండ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ వచ్చింది. బాన్సువాడలో 19 వార్డులకుగాను 11 , ఎల్లారెడ్డి వార్డులకు 10, బిచ్‌కుందలో 12 వార్డులకు 10 వార్డులను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కామారెడ్డి మున్సిపాలిటీల్లో ఓటర్లు విలక్షణ తీర్పు ఇచ్చారు. మ్యాజిక్ ఫిగర్ చేరుకునేందుకు ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు. చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ఆయా పార్టీలకు ఇండిపెండెంట్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు కీలకం కానున్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్

**నైతిక విజయం తమదే అన్న వేముల**



నిజామాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ):మామున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి గెలిచిందని మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో నైతిక విజయం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలదే అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలకు విరుద్ధంగా అధికార యంత్రాంగాన్ని దుర్వినయోగం చేశారని అన్నారు. రాత్రింబవళ్లు నోట్ల కట్టలు పంపిణీ చేశారని, మద్యాన్ని ఏరులై పారించారని ఆరోపించారు. కొన్నిచోట్ల రిగ్గింగ్ చేయడంవల్లే అక్కడ గెలిచారని తెలిపారు. అధికార బలాన్ని ఉపయోగించి ఎన్నికల్లో గెలిస్తే అది విజయం కాదని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ తీరును గమనిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నప్పటికీ, ఆ పార్టీ సాంకేతికంగా విజయం సాధించిందే తప్ప నైతికంగా గెలిచింది బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. కాంగ్రె స్ పార్టీ అధికార దుర్వినియోగం చేస్తూ, మద్యం, డబ్బులు, చీర లు పంపి ణీ చేసిందని, అన్ని అవాంతరాలను ఎదుర్కొని బీఆర్ఎస్ అభ్యర్థులు వీరోచితంగా పోటీలో నిలిచారన్నారు.ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడినా, గెలిచినా తాము ఎప్పటికీ ప్రజల పక్షమేనని ఎమ్మెల్యే అన్నారు. అధికార పార్టీ అభ్యర్థులకు బీఆర్ఎస్ అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చారని పేర్కొన్నారు. అధికార దుర్వినియోగం, మద్యం, డబ్బు పంపకాలతో కాంగ్రెస్ పార్టీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిందని ఆరోపించారు. అయినప్పటికీ మెజార్టీ సీట్లు సాధించలేకపోయిందని తెలిపారు.

# శివరాత్రి రుద్రుడికి ప్రీతకరం

**ఉపవాసంతో స్వామికి అర్చన మంచిది**



**ద్రాక్షారామం,ఫిబ్రవరి14** :శివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు మహా శివరాత్రి. హిందువులు పెద్ద పండుగల్లో శివరాత్రి ఒకటి. పార్వతీదేవిని శివుడు పెళ్లాడిన రోజునే ఈ పండుగగా జరుపుకుంటారు. అలాగే శివపురాణంలో మహాశివరాత్రికి సంబంధించి ఇంకొన్ని కథలు కూడా ఉన్నాయి. మాఘమాసంలోని కృష్ణ పక్ష చతుర్దశి రోజున మహా శివరాత్రి వస్తుంది. ఈ రోజున శివుడిని భక్తి, పూజలతో కొలిస్తే అంతా మంచి జరుగుతుందని నమ్ముతారు. ఈ ఏడాది అలాంటి పవిత్రమైన రోజు ఫిబ్రవరి 15న వచ్చింది. దేశమంతటా శివాలయాల్లో పెద్ద ఎత్తున శివరాత్రి సంబరాలు జరుగుతుంటాయి. శివరాత్రి అనగానే అందరికీ వెంటనే గుర్తొచ్చేది. ఉపవాసం, జాగరణ. ఈ రోజున ఉపవాసం ఉండి, రాత్రి జాగరణ చేస్తే పుణ్యం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు.శివరాత్రి నాడు తెల్లవారుజామునే లేచి, స్నానం చేసి ఆ తర్వాత శివరాత్రి వ్రతాన్ని మొదలుపెట్టాలి. ఈ వ్రతం చేసేటప్పుడు ఉపవాసం, జాగరణం, బ్రహ్మచర్యం అనే నియమాలు పాటించాలి. ఇంట్లోనే గానీ, ఆలయంలోగానీ వ్రతాన్ని ఆచరించవచ్చు. రాత్రంతా జాగరణం ఉండి, ఉదయాన్నే స్నానం చేశాక మళ్లీ పూజ చేసి వ్రతాన్ని విడవాలి. అన్నం లాంటి రోజూ తీసుకునే ప్రధాన ఆహారం కాకుండా పాలు, పండ్లు మాత్రమే, అదీ సాయంత్రం పూటనే తీసుకోవాలి. ఇతరులతో దైవ సంబంధమైన మాటలనే ఎక్కువగా మాట్లాడితే మంచిది. ఓం నమః శివాయ మంత్రాన్ని జపిస్తూ ఉండాలి.

అనారోగ్యంతో ఉన్నప్పుడు ఉపవాసం ఉండకండి.మహా శివరాత్రి నాడు భక్తులు ఉపవాస దీక్షను పాటిస్తారు. చాలామంది కఠినంగా ఉండి.. కనీసం నీరు కూడా తాగరు. దీనిని నిర్జల ఉపవాసం అంటారు. కొంతమంది పాలు పండ్లు లాంటి సాత్విక ఆహారం తీసుకుంటారు. ప్రస్తుతం జీవన ప్రమాణాల దృష్ట్యా పెరుగు, మజ్జిగ, కొబ్బరి నీరు డ్రై ఫ్రూట్స్ వంటివి కూడా తినవచ్చు. శివరాత్రి మరుసటి రోజు సూర్యోదయం అయిన తరువాత ఉపవాస దీక్షను విరమించాలి. మహాశివరాత్రి ఉపవాస సమయంలో కొన్ని ఆహారాలను ఖచ్చితంగా తినకూడదు. వీటిలో గోధుమలు, బియ్యం, పప్పులు మరియు పప్పుధాన్యాలు వంటి ధాన్యాలు ఉన్నాయి. ఉల్లిపాయలు, వెల్లుల్లి , ఉడికిన పదార్థాలను తినకూడదు. ఇంకా వీటితో పాటుగా మద్యం, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండాలని పండితులు చెబుతున్నారు. శివరాత్రికి చేసే జాగరణ మనలో ఉన్న శివత్వాన్ని జాగృతం చేస్తుంది. జాగరణం మనలో ఉన్న శివుడిని జాగృతం చేస్తుంది, తమస్సును తొలగిస్తుంది. సినిమాలు చూస్తునో, పిచ్చి కబుర్లు చెప్పుకుంటూనో, కాలక్షేపం చేస్తూనో చేసే జాగరణకు అది జాగరణ అవ్వదు, కాలక్షేపం మాత్రమే అవుతుంది. అప్పుడు పుణ్యం రాకపోగా, ఆ సమయంలో మట్లాడిన చెడు మాటల వలన పాపం వస్తుంది. శివరాత్రి మరునాడు ఉదయం శివాలయాన్నిసందర్శించి, ప్రసాదం తీసుకుని, ఇంటికి వచ్చి భోజనం చేసి ఉపవాస వ్రతం ముగించాలి. అందరూ గుర్తుపెట్టుకోవలసిన ముఖ్య విషయం, శివరాత్రి నాడు ఉపవాసం, జాగరణ చేసినవారు, తరువాత రోజు రాత్రి వరకు నిద్రించకూడదు. అప్పుడే సంపూర్ణఫలం దక్కుతుందని చెప్తారు.

# అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యం

**కొనసాగుతున్న గాలింపు చర్యలు**

బెంగళూరు,ఫిబ్రవరి14 : అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యమయ్యాడు. కర్ణాటకకు చెందిన సాకేత్ శ్రీనివాసయ్య (22) ఫిబ్రవరి 9 నుంచి కన్పించకుండా పోయాడు. దీంతో అతడి కోసం పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు.సాకేత్ బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుతున్నాడు. అతడు చివరిసారిగా క్యాంపస్‌కు కిలోమీటరు దూరంలో ఉన్న లేక్ అంజా సమీపంలో కన్పించినట్లు తెలుస్తోంది. అక్కడ అతడి పాస్‌పోర్టు, ల్యాప్‌టాప్ ఉన్న బ్యాక్‌ప్యాక్‌లను అధికారులు గుర్తించారు. అతడిని గుర్తించేందుకు స్నేహితులతో కలిసి స్థానిక అధికారులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. సాకేత్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నామని, వారికి అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చింది. అమెరికా అధికారులతోనూ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

# లాయర్ స్వప్న కేసులో నిందితుల అరెస్ట్

**హత్యకు ఉప యోగించిన కార్లు, ఫోన్లు స్వాధీనం**
**భూ వివాదం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసుల వెల్లడి**

రంగారెడ్డి,ఫిబ్రవరి14 : మొయినాబాద్ కేతిరెడ్డిపల్లిలో న్యాయవాది స్వప్న హత్య కేసులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ గోటికె స్వప్న ఫిబ్రవరి 4న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. న్యాయవాది స్వప్న హత్యకు భూ వివాదమే కారణమని నిర్ధారించారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులలో ప్రధాన నిందితుడు స్వప్న సొంత అన్న గోటికె రాజు మరో ముగ్గురు సహచరులతో కలిసి హత్యకు కుట్ర చేసినట్లు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ యోగేష్ గౌతమ్ చెప్పారు. సర్వే నంబర్ 339లోని 4 ఎకరాల భూమిపై వివాదం. భూమి సర్వే కోసం వెళ్లిన సమయంలో నిందితులు స్వప్నపై దాడికి పాల్పడ్డారు. మొదటగా కారుతో ఢీకొట్టి, తర్వాత రాళ్లు,కర్రలతో దాడి చేసి అనంతరం కత్తితో గొంతు కోసి హత్య చేశారు. దీంతో ఘటన స్థలంలోనే స్వప్న మృతి చెందింది. హత్య అనంతరం ఇన్నోవా కార్, స్కూటీలో నిందితులు పరారయ్యారు. ఇన్నోవా కారు, స్కూటీ సీజ్ చేశారు. నలుగురు నిందితుల మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కొడవలిని కూడా సీజ్ చేశాం అని డీసీపీ యోగేష్ తెలిపారు. చెల్లిని చంపిన సొంత అన్న కేసులో మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే స్వప్న అన్న రాజుతో పాటు ఇద్దరి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. స్వప్న లొకేషన్ వివరాలు ఎప్పటికప్పుడు రాజుకు చేరవేసిన శేఖర్ అనే మరో వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గతంలోనూ రెండు సార్లు స్వప్నను హత్య చేసేందుకు ప్రయత్నించినట్టు రాజు విచారణలో ఒప్పుకున్నాడు. ఒకసారి కారుతో మరోసారి బుల్డోజర్‌తో స్వప్నను ఢీ కొట్టించే ప్రయత్నం చేశాడు రాజు. హత్య చేసి రోడ్డు ప్రమాదంగా మలిచేందుకు ప్లాన్ చేశాడు. రెండు ఘటనల నుంచి స్వప్న తప్పించుకుంది. సీసీ కెమెరాలు లేని ప్రదేశాలు చూసి స్వప్నను వెనుక నుంచి ఢీ కొట్టేందుకు రాజు ప్లాన్ చేశాడు. ప్లాన్ సక్సెస్ చేసేందుకు తన స్నేహితులు వీరేష్, శివ, శేఖర్ సహాయం తీసుకున్నాడు. ఈ రోడ్డు ప్రమాదం కేసులను హత్యాయత్నం కేసులుగా పోలీసులు మార్చనున్నారు.

# సీల్డ్ కవర్‌లో ఎమ్మెల్యేలే ప్రోగ్రెస్ రిపోర్ట్

**మారకపోతే మీకే నష్టం తప్పదు**
**ఎమ్మెల్యేకు బాబు గట్టి హెచ్చరిక**

**అమరావతి,ఫిబ్రవరి14** : ఎమ్మెల్యేల పనితీరు మారకపోతే వారికే నష్టమని, సీఎం నారా చంద్రబాబు నాయుడు తన పాలనా శైలిపై మరోసారి స్పష్టత ఇచ్చారు. 1995-96లో తన పాలనలో ఉన్న నిక్కచ్చితత్వాన్ని మరోసారి పునరావృతం చేస్తానని ఆయన ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్యేలు, నేతల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, వారికి సీల్డ్ కవర్లలో నివేదికలు ఇస్తున్నామని తెలిపారు. ఈ నివేదికల ద్వారా వారిని వారికే అద్దంలో చూపిస్తున్నామని, మారకపోతే వారికే నష్టమని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు నాయుడు శనివారం అమరావతిలో పార్టీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. '1995-96 మాదిరిగానే నిక్కచ్చిగా ఉంటా. 9 అంశాల్లో సర్వే చేయించి నివేదికలు ఇస్తున్నా. సీల్డ్ కవర్లలో ఇచ్చే ఈ నివేదికల ద్వారా ఎమ్మెల్యేల పనితీరు, లోపాలను స్పష్టంగా చూపిస్తున్నాం. మారకపోతే వాళ్లకే నష్టం' అని చంద్రబాబు అన్నారు. ఇక నుంచి ఎమ్మెల్యేల పనితీరుపై అత్యంత కఠినంగా వ్యవహరించనున్నానని సీఎం పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ పనితీరుపై సీఎం చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. 'లోకేష్ పని లోకేష్ చేస్తున్నారు, నా పని నేను చేస్తున్నాను' అని స్పష్టం చేశారు. ముఖ్యంగా మంగళగిరి చేనేత చీరలకు లోకేష్ కల్పిస్తున్న అంతర్జాతీయ బ్రాండింగ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రదోష కాలమే పరమశివుడికి ప్రీతికరం

**ఆ సమయంలోనే పూజలు చేస్తే మంచిది**

వేములవాడ, ఫిబ్రవరి14 :తిథులలో త్రయోదశి, చతుర్దశి చాలా ప్రత్యేకమైనవి. శివరాత్రికి సంబంధించినంత వరకు 'ప్రదోష' కాలం చాలా ముఖ్యం. అంటే రాత్రి కాలం అని అర్థం. రాత్రి వేళ ప్రదోషంతో ప్రారంభమవుతుంది. అంటే... సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల మధ్య సమయం అన్నమాట. ఈ సమయంలో పరమేశ్వరుడిని పూజించినా, శివ పంచాక్షరీ ధ్యానం చేసినా మానసిక ప్రశాంతత లభిస్తుంది. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఇక, త్రయోదశికి మన్మథుడు, చతుర్దశికి కలి పురుషుడు అధిపతులు. వీరిరువురినీ నియంత్రించే శక్తి ఒక్క పరమేశ్వరుడికే ఉంది. అలాగే బుధ, గురువారాలు బుద్ధికీ, మాటకీ సంకేతం గనక... రోజూ కాకపోయినా ఈ రోజుల్లో, ఆ తిథుల్లో ప్రదోషకాలంలో శివారాధన చేయాలని చెబుతారు. 'ఓం నమః శివాయ' అని స్మరిస్తే చాలు కరిగిపోతాడు పరమశివుడు. భక్తితో ఓ సుమం సమర్పించినా సంతుష్టుడవుతారు. ఇక స్వామికెంతో ప్రీతి కరమైన ప్రదోష కాలంలో పూజిస్తే విశేష ఫలితాలు ఉంటాయి. ప్రదోషమంటే పాప నిర్మూలన. తెలిసీ తెలీక చేసే పాపకర్మల వల్ల ప్రతిబంధకాలను కొని తెచ్చుకున్నట్లవుతుంది. దాంతో పురోభివృద్ధికి ఉన్న అవకాశాలు పరిమితమౌతాయి. ఆ పాపకర్మలు నిర్జీవం కావాలంటే, దానికి తగ్గ పుణ్యకర్మలు చేయాలి. పరమశివుడు ప్రమథ గణాలతో కొలువయ్యుండే ప్రదోషకాలంలో శివుని స్మరిస్తే మన పాప కర్మల ఫలాన్ని తాను స్వీకరించి కష్టాలను తొలగిస్తాడనేది భక్తుల నమ్మకం. అందుకే ఉపవాసంత తరావత ప్రదోష కాలంలో అభిషేకాలు చేయాలి.

# గ్రామీణ వైద్యులకు అండగా ఉంటాం....

### కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగేందర్..

**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) ఫిబ్రవరి 14 :** పేద ప్రజలకు 24 గంటలు365 రోజులు అందుబాటులో ఉండే గ్రామీణ వైద్యులకు అండగా ఉంటానని కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకులు తుమ్మల యుగేందర్ అన్నారు. ఖమ్మం పట్టణంలోని మంచికంటి ఫంక్షన్ హాల్లో ఆర్ఎంపిడబ్ల్యూఏ 10వ జిల్లా మహాసభ జిల్లా అద్యక్షుడు బొమ్మినేని కొండలరావు అధ్యక్షతన జరిగిన సభకి ముఖ్యతిధిగా హాజరై మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యం అందిస్తున్న ఆర్ఎంపిలపై దాడులు ఆపాలని ప్రభుత్వాలను కోరారు.

#### ఐక్యంగా పోరాడుదాం...

*పంగా మల్లేశం రాజమౌళి..*

ఆర్ఎంపి వ్యవస్థ రోడ్డు న పడే పరిస్థితి నేడు దాపురించిందని ఐక్యంగా పోరాడకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని గ్రామీణ వైద్యుల సమాఖ్య రాష్ట్ర అద్యక్షుడు పంగా మల్లేశం స్టీరింగ్ కమిటీ మెంబర్ మిట్టపల్లి రాజమౌళి లు అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎంసీ టిజిఎంఎసీ లు కలిసి సంయుక్తంగా మనపై చేస్తున్న దాడులను అరికట్టాలంటే ముందు మనమంతా ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని కోరారు. పరిమితికి మించి వైద్యం చేస్తున్నామనే సాకుతో మనపై వివిధ రూపాల్లో దాడులు జరుగుతున్నాయని గుర్తుచేశారు. అదేవిధంగా జిల్లా అద్యక్షార్యదర్శులు బొమ్మినేని కొండలరావు బోయినపల్లి శ్రీనివాస్ రావు లు మాట్లాడుతూ మహాసభని విజయవంతం చేసిన ఆర్ఎంపిడబ్ల్యూఏ సభ్యులకు మహాసభకు ఆర్థిక సహకరం అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

#### సామాజిక చైతన్యం పై అవగాహన ఉండాలి...

*స్పర్శ సామాజిక అధ్యయన వేదిక కె భాస్కర్...*

గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా10 వ మహాసభకు స్పర్శ సామాజిక అధ్యయన వేదిక కె భాస్కర్ హజరైయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు వైద్యం తోపాటు సామాజిక చైతన్యం పై కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఆర్ఎంపి లకు స్పర్శ సామాజిక అధ్యయన వేదిక ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు....

ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి జిల్లా అద్యక్షులు కె క్రిష్ణ మూర్తి రాష్ట్ర కమిటీ సభ్యులు ఐ నారాయణ రావు కొంగర గోపి బండి కొమరయ్య జిల్లా కొశాధికారి హసన్ ఉపాద్యక్షులు జెడి మూర్తి షేక్ నాగుల్ మీరా మురహరి ఖాసీం మాధవరెడ్డి రహీం వెంకటరమణ అక్కినపల్లి నాగేశ్వరరావు పుల్లారెడ్డి గౌతమ్ బాలు కిషోర్ భాస్కర్ క్రిష్ణమోహన్ రమేష్ కాంతారావు కనకరావు శ్రీరాములు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ బాధ్యులు పర్సగాని నాగేశ్వరరావు దావా సత్యనారాయణ ప్రచార కార్యదర్శి గండారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పోన్ ద్వారా మద్దిశెట్టి సామెలు ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న ధీరజ్ శర్మ



**భద్రాద్రి బ్యూరో (చట్టం న్యూస్) ఫిబ్రవరి 14 :** మద్దిశెట్టి సామేలు ఆరోగ్య పరిస్థితి గురించి న్యూఢిల్లీ నుంచి ఎన్‌సీపీ పార్టీ ఎన్‌వైసీ జాతీయ అధ్యక్షులు ధీరజ్ శర్మ ఫోన్ ద్వారా పరామర్శించారు.
అలాగే భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ -- భారతీయ జనతా పార్టీ జాతీయ ఎస్సీ శిక్షణ తరగతుల ఇన్‌ఛార్జ్ శాంత్ ప్రకాష్ జాటవ్ కూడా మద్దిశెట్టి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.
భారత ప్రభుత్వ మాజీ అడ్వైజర్ (ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్) మరియు ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి రామ్ కుమార్ వాలియా కూడా ఫోన్ ద్వారా సంప్రదించి, మద్దిశెట్టి త్వరితగతిన కోలుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.అలాగే భారతీయ యువ సేవా సంఘ్ కోర్ కమిటీ చైర్మన్ మరియు విశ్వ హిందూ పరిషత్ దక్షిణ భారత ఇన్‌ఛార్జ్ డా. సౌరవ్ దాస్ కూడా ఫోన్ ద్వారా పరామర్శించి, మద్దిశెట్టి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.
ఈ సందర్భంగా ముగ్గురు నాయకులు మద్దిశెట్టి కి ధైర్యం చెప్పుతూ, అవసరమైతే ఢిల్లీ నుంచి అత్యుత్తమ వైద్య సేవలు అందించడానికి తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు.
ఈ కష్ట సమయంలో ఇంత ఆప్యాయతతో, ప్రేమతో పలుకరించి మాకు ధైర్యం నింపిన ఈ ముగ్గురు నాయకులకు మద్దిశెట్టి సామేలు తరపున, మా కార్యకర్తలందరి తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. వారి ఆదరణ, మద్దతు మా కుటుంబానికి, మా బృందానికి ఎంతో బలంగా నిలిచింది.

# కరీంనగర్‌లో బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయం

### మేయర్ పదవి కోసం కాంగ్రెస్, ఎంఐఎంతో జట్లు

### తాజా పరిస్థితులపై ఆరా తీస్తున్న కేంద్రమంత్రి బండి

కరీంనగర్,ఫిబ్రవరి14 :కరీంనగర్‌లో మేయర్ పదవి కోసం ప్రధాన పార్టీల మధ్య రాజకీయ పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. 'మేయర్' పదవి కోసం బీఆర్ఎస్ తన సిద్దాంతాలను పక్కన పెట్టి కాంగ్రెస్, ఎంఐఎం కుమ్మక్కైనట్లు ప్రచారం సాగుతోంది. భారతీయ జనతా పార్టీని ఓడించేందుకు మూడు పార్టీలు ఒక్కటైనట్లు సమాచారం. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి బీజేపీని ఓడించేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇండిపెండెంట్ కార్పొరేటర్‌ను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు శుక్రవారం రాత్రి సదరు కార్పొరేటర్‌తో సమావేశమయ్యారు. అదే సమయంలో బీఆర్ఎస్ నేతలు కూడా కార్పొరేటర్‌తో రహస్యంగా చర్చలు జరిపినట్లు సమాచారం. ఇండిపెండెంట్లు, ఇతర కార్పొరేటర్లు, బీజేపీ సభ్యుల మద్దతు కోసం ఆఫర్లు ఇవ్వాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. తనకు మేయర్‌గా మద్దతిస్తే ఆర్థిక సహాయం కూడా అందిస్తానని కూడా ఆ ఇండిపెండెంట్ కార్పొరేటర్ సంప్రదింపులు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామాలను కమలం పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. తమ పార్టీ కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేయడాన్ని ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్యగా బీజేపీ అభివర్ణిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మధ్య రహస్య ఒప్పందం ఉందని, ఇది ప్రజలను మోసం చేయడమేనని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ మొత్తం ఎపిసోడ్‌పై కేంద్రమంత్రి, బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ విపక్షాల డ్రామాలను ఆధారాలతో సహా ఎండగట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నట్లు సమాచారం. కరీంనగర్ మేయర్ పీఠం చుట్టూ జరుగుతున్న ఈ పరిణామాలు కేవలం ఒక నగరానికి పరిమితం కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసేలా ఉన్నాయి. బండి సంజయ్ మీడియా సమావేశం తర్వాత ఈ వ్యవహారం మలుపులు తిరిగే అవకాశం ఉంది.

## వేంకటాద్రికి నివాళులు అర్పించిన సురేష్ నాయక్ మరియు కొట్టం శిరీష రెడ్డి



**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) ఫిబ్రవరి 14 :** శనివారం ఎదులాపురం మున్సిపాలిటీ, వరంగల్ క్రాస్ రోడ్ పరిధిలోని 30 వ వార్డు మదర్ థెరిసా కాలనీ కి చెందిన ఆశా వర్కర్ అన్నామణి తండ్రి వేంకటాద్రి అనారోగ్య సమస్యల కారణంగా ఈ రోజు ఉదయం తుదిశ్వాస విడిచారు.స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా.సురేష్ నాయక్ మరియు కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు కొట్టం శిరీష రెడ్డి వారి స్వగృహం నందు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం శిరీష రెడ్డి తన సొంత నిధులు 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి అలాగే వారి ఆత్మకి శాంతి కలగాలని భగవంతునికి ప్రార్థించారు.అలాగే వారి కుటుంబాన్నీ ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ ఎల్ల వేళల అండగా ఉంటుందని భరోసా ఇచ్చి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా వారితో పాటు పాలేరు నియోజకవర్గ ఆత్మా కమిటీ డైరెక్టర్ ఎన్. పి. చారీ,ఎదులాపురం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు కళ్లెం.శేష్ రెడ్డి, ఇమ్మాన్యేలు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# శైవక్షేత్రాలకు భక్తుల రాక

### శ్రీశైలంలో పెరిగిన రద్దీ

విజయవాడ,ఫిబ్రవరి14 :మహాశివరాత్రి ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల్లోని శైవ క్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. శైవ క్షేత్రాలకు భక్తులు చేరుకుంటున్నారు. ముఖ్యంగా ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలంలో భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీస్ యంత్రాంగం, భక్తులను క్షేత్రాలకు చేర్చేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శ్రీశైల మల్లికార్జున స్వామికి నిర్వహించే అత్యంత పవిత్రమైన 'పాగాలంకరణ' ఘట్టాన్ని వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు.ఆలయ పరిసరాలను సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి నిరంతరం పర్యవేక్షించాలని డీఐజీ ఆదేశించారు. క్యూ లైన్లలో భక్తులకు తాగునీరు, వైద్య సహాయం అందేలా చూడాలని, ఎండ తీవ్రత దృష్ట్యా ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సూచించారు. వాహనాల పార్కింగ్ విషయంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా అదనపు సిబ్బందిని నియమించి, ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం నుంచి ప్రముఖ శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మచిలీపట్నం డిపో మేనేజర్ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రసిద్ధ క్షేత్రాలైన పెదకళ్లేపల్లికి 15 బస్సులు, ఐలూరుకు 10 ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెచ్చారు. భక్తులపై అదనపు భారం పడకుండా, స్పెషల్ బస్సుల్లో కూడా సాధారణ ఛార్జీలనే వసూలు చేస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. బస్సుల ఫిట్‌నెస్‌ను స్వయంగా పరిశీలించిన డిపో మేనేజర్.. ప్రయాణికుల భద్రత విషయంలో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. గ్యారేజీలో ఉన్న బస్సుల కండిషన్‌ను



తనిఖీ చేశారు.

## సీఎం కప్‌లో భాగంగా బాలికల 60

### కేజీ తైక్వండో పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన వి. ఇందు. ;





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 14 ,(చట్టం బ్యూరో) :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన బాలిక. సీఎం కప్ లో భాగంగా 17 సంవత్సరాలు లోపు బాలికల 60 కేజీల తైక్వాండో పోటీలో జిల్లా పరిషత్ హైస్కూల్ చల్లూరు కు చెందినటువంటి 9వ తరగతి విద్యార్థిని వి. ఇందు ప్రథమ స్థానం పొంది గోల్డ్ మెడల్ సాధించారు. అంతేకాకుండా రాష్ట్రస్థాయికి కూడా ఎంపిక కావడం జరిగింది. బాలుర వాలీబాల్ విభాగంలో పాఠశాలకు చెందినటువంటి చరణ్, అరుణ్ కూడా రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పాఠశాల నుండి విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంపత్ కుమారా చారి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థులకు , పి ఈ. టీ.రజిని మేడమ్ గారిని ప్రత్యేకంగా అభినందించారు.

## అత్తాపూర్‌లో అడ్వకేట్ దారుణ హత్య

### కిరాతకంగా హత్య చేసిన బావమరుదులు

**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** నగరంలోని అత్తాపూర్‌లో అడ్వకేట్ మహమ్మద్ ఖదీర్ దారుణ హత్యకు గురయ్యారు. సులేమాన్ నగర్‌లోని తన సొంత ఆఫీసులో అడ్వకేట్‌పై కత్తులతో దాడి చేశారు. ఖదీర్‌ను మొదటి భార్య తమ్ముళ్లు అతి కిరాతకంగా చంపేశారు. పలుమార్లు కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడిన ఖదీర్.. సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. దాడి జరిగిన వెంటనే నిందితులు పరారయ్యారు. అడ్వకేట్ ఖదీర్‌కు రెండు పెళ్లిళ్లు జరిగాయి. రెండో పెళ్లి చేసుకోవడంతో.. ఖదీర్ మొదటి భార్య ఇంటికి రావడం మానేశాడు. ఈ కోపంతో బావ ఖదీర్‌పై.. ఇద్దరు బామ్మర్దులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఖదీర్ ఆఫీస్‌లో ఉన్న సమయంలో అక్కడకు వచ్చిన వారు.. మొదట రాడ్‌తో దాడి చేశారు. తలపై బలంగా కొట్టడంతో మహమ్మద్ ఖదీర్ కుప్పకూలిపోయాడు. ఆపై కత్తులతో ఆరుసార్లు పొడిచారు. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు.. తక్షణమే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ ఆధారాల సేకరిస్తోంది. ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. అడ్వకేట్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.

## రైతుభరోసా విడుదలకు రంగం సిద్ధం

**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే రైతులకు శుభవార్త చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల పక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6,000 చొప్పున అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా నిర్ణయం చేసినట్లు తెలుస్తోంది. రైతు భరోసా నిధుల విడుదలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సిఎం రేవతం చర్చించే అవకాశం ఉంది. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

## ఎక్స్ అఫీషియో సభ్యులకు ఓటు హక్కు

### రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టీకరణ

హైదరాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ):మున్సిపల్ పరోక్ష ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన జారీ చేసింది. మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో ఎక్స్‌అఫీషియో సభ్యుల ఓటుహక్కుపై స్పష్టతనిచ్చింది. తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం-2019 ప్రకారం.. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఇతర ఎక్స్‌అఫీషియో సభ్యులకు ఓటు హక్కు తప్పనిసరి అని తెలిపింది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కానివారు ఓటు వేసేందుకు అనర్హులని సీఈసీ స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కాకుండా ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఓటువేసే వారిని అనర్హులుగా పరిగణిస్తారని, వారి ఓట్లు చెల్లవని న్యాయస్థానం తెలిపింది. ఈ నేపథ్యంలో కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సీఈసీ సర్క్యులర్ జారీ చేసింది. నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించింది. దీంతో స్థానిక ఓటు హక్కు ఉంటేనే ఎంపీలు, ఎమ్మెల్సీలు.. మేయర్/ఛైర్ పర్సన్ పదవుల ఎన్నికల్లో ఓటువేసి ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది.

## సిఎం, డిప్యూటి సిఎంల ఫోటోల మార్ఫింగ్

### రాజశేఖర్ అనే వ్యక్తిపై కేసు నమోదు

విజయవాడ,ఫిబ్రవరి14 :ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లపై జరుగుతున్న సామాజిక మాధ్యమాల దుష్ప్రచారంపై విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. రాష్ట్రంలోని అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులపై సోషల్ మీడియా వేదికగా అసభ్యకరమైన లేదా తప్పుదోవ పట్టించే రీతిలో పోస్టులు పెట్టినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసిన వ్యక్తిపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. రాజశేఖర్ రావు అనే వ్యక్తి సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం, మార్ఫింగ్ చేసిన ఫొటోలను ప్రచారం చేయడం చట్టవిరుద్ధమని అధికారులు హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. సోషల్ మీడియా ఎ÷-లాట్‌ఫామ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నామన్నారు.

## సిపిఐ నేత గిరిప్రసాద్ సతీమణి కమలాదేవి మృతి

### సంతాపం ప్రకటించిన ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్,ఫిబ్రవరి14 : సీపీఐ అగ్ర నాయకులు, కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్ సతీమణి నల్లమల కమలాదేవి (87) ఇకలేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లో కన్నుమూశారు. కమలాదేవి భౌతిక కాయాన్ని బంధువులు, పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు సందర్శనార్థం జూబ్లీహిల్స్‌లోని ఆమె పెద్ద కుమార్తె నివాసంలో ఉంచనున్నారు. సాయంత్రం 4 గంటల వరకు అక్కడే ఉంచి తరవాత సాయంత్రం 5-00 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. నల్లమల కమలాదేవి మృతిపట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సంతాపం ప్రకటించారు. నల్లమల కమలాదేవి తన భర్త గిరిప్రసాద్‌కు అనునిత్యం వెంట నడిచి ఆయన పోరాటంలో భాగస్వాములయ్యారని అన్నారు. వారి కుటుంబసభ్యులతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని అన్నారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యాలు

### కాంగ్రెస్ అక్రమాలతో గెలుపు

### మాజీమంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

సిద్దిపేట,ఫిబ్రవరి14 : మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ పలు దౌర్జన్యాలకు పాల్పడిందని, డబ్బులు, మద్యం ఏరులై పారించిందని మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్దాల పునాదులు మీద పుట్టి అన్ని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అధికారం నడిపిస్తుందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో గుడ్డిలో మెల్లలాగా కాంగ్రెస్ గెలిచిందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలుపొందారని కొనియాడారు. రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు ఎపుడు కూడా శాశ్వతం కాదు. ప్రజలు శాశ్వతం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కి సరైన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఎక్కడ ఒక్క ప్రాజెక్ట్ నిర్మించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ టికెట్ పెట్టి పురుషులకు డబుల్ రెట్లు పెంచారని ఆరోపించారు.కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారని, రాష్ట్రం సాధించడం ఒక్క అద్భుతమైన ఘట్టమని, తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్ట్ లు నిర్మించారని తెలిపారు. గతంలో నీరు, విద్యుత్ లేక రైతులు ఇబ్బంది పడ్డారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడితే కేసీఆర్ పంట సహాయం చేశారని గుర్తు చేశారు.తాను టీడీపీ లో ఉన్నపుడు 5గంటలకు మించి విద్యుత్ రాకపోయేదని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వంలో కుదేలయింది ని, కేసీఆర్ హయాంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటితే కాంగ్రెస్ హయాంలో భూముల ధరలు పడిపోయాయని అన్నారు. సిద్దిపేటను హరీష్ రావు బాగా అభివృద్ధి చేశారని ప్రశంసించారు.

## శివదేవుని మణిపూసలు



శివ శివ యని యనర జీవ
హర హర యని యనర జీవ
శివుడే హరుడని మరువకు
మనసున ఓ మాయ జీవ

పార్వతి వల్లభ రారా
గంగా ధర ఇటు రారా
భక్తుల మొరలే వినవా
కైలాస నివాస రారా

శ్రీశైలా వాస లింగా
స్థిర రూపుడవు లింగా
కరుణా లోలుడవు శివా
కావగ రావా లింగా

కరి చర్మాంభ శంకరా
త్రిశూల పాణి శంకరా
జటా జూట దారి లింగ
కరుణామయుడ శంకరా

హిమగిరి వాస మహదేవ
సుమములు అర్పింతు దేవ
నటన శేఖర శంకరా
గరళ కంఠుడవే దేవ

శంభో శంకర దేవా

కరుణించర మహదేవా
బోలా శంకర శివ శివ
బ్రోవగ రావా దేవా

సుర పూజిత హర లింగా
అసుర పూజితా లింగా
హర హర నిన్నే దలతును
ఆత్మలోని శివ లింగా

పరమ పూజితా లింగా
పాప నివారణ లింగా
సర్వేశ్వర నిను మరువను
దయ జూపుము శివ లింగా

అక్కి నర్సింలు గౌడ్
విశ్రాంత ఉపాధ్యాయుడు
మల్లాపూర్ రంగారెడ్డి జిల్లా
మణిపూసల శిరోమణి

## సంపత్కారకుడు - శివుడు



సృష్టి, స్థితి, లయ కర్తలయిన త్రిమూర్తులలో శివుడు లయకారకుడు.
శివాజ్ఞ లేనిదే చీమయినా కుట్టదు
మార్కండేయునికి చిరంజీవత్వాన్ని ప్రసాదించిన ప్రాణప్రదాత.
అడిగిన వెంటనే వరాలు ఇచ్చే భోళా శంకరుడు...!!

ప్రమద గణాలచే అను నిత్యం
ఆరాధింపబడే మహనీయుడు.
గ్రహాలన్నీ శివుని ఆధీనంలో ఉంటాయి.
అందుకే శివారాధన అత్యంత శ్రేయస్కరం.
నమః శంభవేచ మయోభవేచ
నమః శంకరాయచ
మయస్కరాయచ అని
నారికేళ జలంతో శివుని అభిషేకం సర్వ శుభకరం..!

సగరపుత్రుల సద్గతికై
భగీరథుని తపస్సుకుమెచ్చి
పరమ పవిత్రమైన గంగను
మనకందించిన లోకోద్ధారకుడు.
విష్ణు సహస్రనామంలో
మోక్షానికి కారణమైన
శ్రీరామ రామ రామేతి అన్న
తారకమంత్రాన్ని మనకందించి
మానవ జీవితాలను ఉద్ధరించిన పరమాత్ముడు..!!


ఆదిశంకరులకు చండాలుని రూపంలో
దర్శనమిచ్చి, అహంకారాన్ని పోగొట్టి
కులమతభేధాలు లేవని
జీవులందరు పరమాత్మ స్వరూపాలే అని
ఆత్మజ్ఞానాన్ని అమరత్వాన్ని
ప్రసాదించిన పుణ్యమూర్తి.!

ఓం నమఃశివాయ అనే పంచాక్షరీ మంత్రం
భక్తి శ్రద్ధలతో పఠించిన పాపాలను పారద్రోలు
లోక కల్యాణార్ధం గరళంను
కంఠం లోనే ఉంచుకుని
కాపాడిన కారుణ్యమూర్తి
ఎన్నని చెప్పను, ఏమని చెప్పను
శివలీలలు వర్ణింప తరమా?
అందుకే జగతిన శివుడు
సంపత్కారకుడు....!!

లోకా సమస్తా సుఖినో భవంతు.

కవి మిత్ర , సాహిత్యరత్న
అయ్యలసోమయాజుల ప్రసాద్.
(పుష్యమి)
విశాఖపట్నం

## వలస బ్రతుకులు



ఆకలితీర్చే వసతులు కరువై
పొట్టకూటి కోసం పురిటినెప్పులు
శ్రమించినా దొరకని ఫలితం
ఆకలితో అలమిటించే జనం!

వలసలు అనే నేటి అంశం
ఉపాధిని కోల్పోయే టెక్నాలజీతో
ఉరుకులు పెడుతూ పయనం
సామాన్యునికి పెద్ద శఠగోపం!


కుటుంబమంత కష్టించిన
కడుపులు నిండని బ్రతుకులు
శ్రమని దోచుకునే కుటిలత్వం
మార్చలేని కేంద్రరాష్ట్ర ప్రభుత్వం!

చదువు సంధ్యలు తప్పవాయే
ఉచితాలు ఊరకనే పాయె
అర్హుడికి అందని పథకాలు
అందని ద్రాక్ష ఐపాయే!

వ్యవసాయాలు మర్చిపాయే
చదువులకు విలువ లేకపాయె
విలాసంగా బ్రతకాలంటే
నేడు వలసలు తప్పవాయే!

డా:ప్రసాదు యంవివి(సాదు)
కల్లూరు, ఖమ్మం జిల్లా

## అక్షరాలపై అయిదు ఆటవెలదులు



రాయ రాయ అక్షరాలు రత్నాలగు
చదువ చదువ బుద్ధి చాల పెరుగు
విద్య లేనివాడు వింతపశువగును
కన్నులుండికూడ కానకుండు

బ్రతుకు నిలువకుండు బంగారమున్నను
బుద్ధిలేనివాడు బూడిదగును
అక్షరాలుయున్న అన్నియు వశమగు
అవియు లేకయున్న అంధుడగును

మాటవంచనాల మాయలోన పడకు
పుస్తకాలతోడ నేస్తముచెయి
వదలకుండ విధిగ వాస్తవాలను చెప్పు
దాచినపుడు దారి దగ్ధమగును

చదువులేనివాడు సరసునందున కప్ప
నీటిలోనయుండి నెరపలేడు

అక్షరమను గొప్ప ఆయుధముండిన
మనుజడపుడు మంచి మానవుడగు

అక్షరములు అగును అమృతపుధారలు
కాలము గడచినను కరగకుండు
కవితలల్లినట్టి కవులకు కీర్తొచ్చు
సాహితీజగమున సతము నిలుచు

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, భాగ్యనగరం.

## ఓ నారీ



ఓ నారీ అవనిలో అన్నీ నీవే.
అమ్మగా అవతరించి, ప్రేమ వర్షం కురిపించి
పెంచి, పెద్ద చేసి, విద్యా బుద్ధులు నేర్పి
ప్రపంచాన్ని చదివించి, ప్రయోజకుణ్ణి చేస్తావు

ఓ నారీ, భార్యగా అవతారం ఎత్తి, తోడు, నీడగా నిలిచి
భర్తకు చేదోడు, వాదోడుగా ఉంటూ
అనురాగ సుగంధాలు పూయిస్తూ
అన్నింటా తానై, భర్త అడుగు జాడల్లో నడుస్తావు.

ఓ నారీ కూతురై నట్టింట నడయాడుతూ
మహాలక్ష్మిలా ఇంట పెరుగుతూ..
తల్లి, తండ్రులపై ప్రేమ చూపుతూ, తాను పొందుతూ..
అందరి హృదయాలను దోచుకుంటావు.

ఓ నారీ మహిళగా అవతారం ఎత్తిన స్త్రీ,
వేద స్వరూపిణి, అమృత మూర్తి..
మహిలో మహిళగా, మగవానికి ధీటుగా నిలిచి...
చెల్లిగా, అక్కగా, ఇల్లాలిగా, తల్లిగా
ఇంటా, బయటా బహురూపాలు నీవే.

ఓ నారీ నీవు ఓ నిస్వార్థ సేవకురాలివి, ప్రతిభావంతురాలివి..
ఓర్పుకు మారు పేరువి, సహనశీలి మహిళవి
ప్రాణం పోయగలవు, ఆకలి తీర్చగలవు,
దయా, దాక్షిణ్యాలను ఏకైక కాలంలో చూపుతూ
అన్ని పనులు చక్కపెట్టగల సవ్యసాచివి.
నీవు లేని జగతి ఊహాతీతం.

తెలికిచెర్ల రాజ కృష్ణ కామేశ్వర రావు
రిటైర్డ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్,
భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ,
ఇస్రో, షార్, శ్రీహరికోట
సూళ్లూరుపేట / తిరుపతి జిల్లా

## నాటి కవుల కవితా శైలి: పోతన గారి పద్యం!



పద్యం:
"గాలిం,గుంభిని,నగ్ని,నంబువుల,
నాకాశస్థలిన్, దిక్కులన్,
రేలన్, ఘస్రములం,దమః
ప్రభల,భూరిగ్రాహ,రక్షో మృగ,
వ్యాళాదిత్య, నరాది జంతు కలహ వ్యాప్తిన్
సమస్తాస్త్ర శ,
స్త్రాళిన్ మృత్యువు లేని జీవనము లోకాధీశ!
యిప్పింపవే"
ప్రస్తావన:

పోతన భాగవతంలో ప్రతి ఘట్టం రమణీయమే!
మరీ కొన్ని సన్నివేశాల రచనా శైలి అత్యద్భుతం!
అలాంటి రస మాధురీ గుళిక ప్రహ్లాద చరిత్ర ఒకటి!
పైన పేర్కొన్న పద్యం చూద్దాం ఏమి చాతుర్యం!
నేపథ్యం:

ఎవరన్నారు అసురులు మందమతులని!
బ్రహ్మ దేవుని కొరకు ఘోర తపస్సు చేశాడు
ప్రహ్లాదుని తండ్రి హిరణ్య కశిపుడు!
రాక చస్తాడా! దిగి వచ్చాడు ఆ విరించి!
వచ్చిన అవకాశం వదలుకునే వాడా ఈ
దనుజుడు,వరాల చిట్టా ముందు పెట్టాడు!
తథాస్తు అన్నాడు,ఎంచక్కా పోయాడు బ్రహ్మ,
పాపం దేవతలే అడకత్తెరలో పోక చెక్కలయ్యారు!
మీరే చదివి చెప్పండి అతగాడా? మనమా మేధావులం!
తాత్పర్యం:

వాయువు వలన,ధరణి చేత,అగ్ని వల్ల,నీటి చేత,ఆకాశములో, అష్ట దిక్కులందు, రేపవళ్ళందు,
చీకటి వెలుగుల చేత,మకర,రాక్షస,జంతు,సర్ప,నర
వైరము వలన,సమస్త అస్త్ర శస్త్రముల చేత మృత్యు
భయము లేని వరము ప్రసాదింపుమని
అత్యంత తెలివిగా బ్రహ్మగారిని
వేడుకున్నాడు ఆ దానవేంద్రుడు!

మరికాస్త ముందు కెళితే మరో విచిత్ర రచనా సరళి!
నృసింహ ఆవిర్భావం,హిరణ్య కశిపుని వధ!
ఇతః పూర్వం బ్రహ్మ గారు ప్రసాదించిన వరములకు
భిన్నంగా శ్రీ హరి నరసింహునిగా రావడం,
ఏపాటి వర భంగము కాకుండా దనుజుని సంహరించడం!
అదీ వ్యాస కవీంద్రుని ప్రతిభ, మన పోతనామాత్యుని
అప్రతి హత ఆంధ్రానువాద కవితా పటిమ!

రచన:
బాచిరాజు సత్యనారాయణ రావు,
(బా. స.రా.)
విజయవాడ

## జీవితం అందంగా మారనీ



( Let Life be Beautiful)
జీవితం అందంగా మారనీ
ప్రపంచం.. వద్దన్నా కానీ.
బతుకు సుందరంగా
సాగనీ..ఎవరొద్దన్నా కానీ.

పరిసరాలే..అందాలకు
అద్దం..ప్రకృతే సొగసులకు
నిలయం. మనసే మనొల్లాసానికి
ఆలవాలం.. జీవ జాలం.

పచ్చని పరిసరాలు
మరిమళ భరితాలు.
పరవశింపజేసే వాతావరణం
నిత్య చైతన్య దీపిక.

అపరిశుభ్ర పర్యావరణం
చికాకుకు నెలవు.
అనారోగ్య కారణాలు
చీదరకు కొలువు.

అవాంచనీయ సంఘటనలు
ఏహ్య భావ ప్రేరేపితాలు.
అసహ్యకరమైన సంభవాలు
జుగుప్సకు పుట్టినిల్లు.

సజ్జన సాంగత్యం
సదాచార ప్రవర్తన
సత్కార్య వర్తనలు..
మనశ్శాంతికి నిలయాలు..ఆలయాలు.

విజయకుమార్ గడియా
చిత్తూరు.

## ఏడేడు లోకాలకేలికవు మాయమ్మ



ఐహికాముష్మి కానంద సామ్రాజ్యాల
నందించు మాయమ్మ కారాధనం
మాహేశ్వరీ సర్వకామ ప్రదాయినీ
మాయమ్మ లలితాంబ నీరాజనం

కమలభవ కమలాక్ష కాలకాలుర కమ్మ
కమనీయ నామమ్ము మాధుర్యము
విమల చారిత్రమ్ము విమతహత సౌశీల్య
విక్రమార్జిత యశ స్సౌభాగ్యము
కమల కమలాలయ శాంకరీ కల్యాణి
గాయత్రి శుభగాత్రి సంపూజ్యము
అమలినాబ్జ షట్చక్రవాసినివమ్మ
శ్రీచక్రనిలయ జయసుస్వాగతం

ఏడేడు లోకాల కేలికవు లోకాధి
పతులకు నీయండ లోకువేముంది
నీడగా వెన్నంట నిత్య విజయానంద
మభయ మారోగ్యాలు భయమేలకో

మూడునాలుగు నైదునారు మొగముల వారు
వేయినాల్కలు వేయికనులు వినుతింతు
రాడి పాడుదురటా భృంగిరిటి దేవర్షి
నారద తుంబురులు ననవరతము

రచన::శంకర్ జీ డబ్బికార్
ఊరు:: ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956

## కారుచీకట్ల నల్లగులాబీలు




ఈ చీకటి కౌగిలింతలో
కళ్ళ నిండా అక్షరాలు అలుముకుని
భావాల కుసుమాలెన్నెన్ని
ఈ కారుచీట్లు మింగేశాయో !
ఈ నిశీధిలో ఓ చిరుదివ్వె వెలిగించి
ఈ చరవాణిలో అక్షర బింబమై
మనుష్యులలో ప్రేమలు ఏమాత్రం లేని
హేయమైన మూసుకుపోయిన వికృత కామం కళ్ళు
చిత్రీకరించనైతినే అనే గుంజాయిషి
తమకు పేరు ఉనికికి నోచుకోని
గుండెల్లో అణుబాంబులు పేలుతున్న సెక్స్ వర్కర్లు
మగాడి కామకోర్కెల క్రూరత్వంలో
బ్రతుకు తెరువు వెతుక్కుంటూ
ఆకాశం చిల్లులు పడేలా రోదిస్తూ
బుక్కెడన్నం తినేందుకు
రాత్రిపూట పుష్పించిన రేరాణులు
పేలవమైన నవ్వుల నల్లగులాబీలు
క్రూరమృగాల కళ్ళల్లో లేడికూనలు
ఆకాశ దర్పణంలో వెలగలేని నక్షత్రాలు
దినం దినం చిదిమివేయబడుతున్న మాంసం ముద్దలు
గుండెల్లో ధైర్యం నూరిపోసుకుంటూ
ఎప్పుడో అగ్నిపర్వతం బద్దలైనట్లు
గుండెల మంటల్లో కూలిపోయే అర్థాశ్కులు
మీకంటూ హృదయం ఉందని
మనస్సు కలలుగనే కళాతపస్వినులు
కళ్లులేని కబోదుల కామం నిండిన కళ్ళు
మీ శరీరాలతో విందు చేసుకునే మృగాలు
ఆకలి కేకలతో అంబరాన్నంటే రోదనల్లో అశువులుబాస్తే
ఆ ఉసురు ఊరికే పోదు
కాళికామాత కళ్ళు తెరిచి
భీకర వడగాలుల్లో అగ్నిసామాధులు
కారుమబ్బులు కూలిపడుతూ,సునామీలు, భీకాతుఫానులు
భూకంపాలు ,ఈదురుగాలులు
లక్షలకు లక్షల జనాలు చీమల్లా కొట్టుకుపోతూ
రేపు మిగిలేది మనసున్న మహారాజులే
ఇకనైనా ఈ మృగాలకు పరివర్తన కలగాలి
కదిలించాలి,,,,,,

అపరాజిత్
సూర్యాపేట

# అట్లీ-అల్లు అర్జున్ మూవీ సినిమా షూటింగ్ డిలేపై అల్లు అసహనం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కుమార్ తో చేస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా గురించి ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. దాదాపు రూ.800 కోట్ల భారీ బడ్జెతో హాలీవుడ్ రేంజ్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజువల్ వండర్‌గా, హైఎండ్ గ్రాఫిక్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. అందుకే ఈ సినిమాకు సంబంధించిన చిన్న న్యూస్ అయినా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతోంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ఈ సినిమా విడుదల తర్వాత ఇండియన్ సినిమా మేకింగ్ స్టైల్‌లో కొత్త ట్రెండ్ సెట్ అవుతుందని భావిస్తున్నారు. లార్జ్ స్కేల్ ప్రాజెక్ట్స్‌కు ఈ సినిమా ఫౌండేషన్‌గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుందనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ, తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై మరో టాక్ ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే? సినిమా షూటింగ్ అనుకున్న దానికంటే నెమ్మదిగా సాగుతుండటంతో అల్లు అర్జున్ అసంతృప్తిగా ఉన్నాడని గాసిప్స్ వినిపిస్తున్నాయి. ఎ÷-లాన్ చేసిన రిలీజ్ డేట్‌కు సినిమా పూర్తి అవుతుందా లేదా అన్న ఆందోళన కూడా బన్నీకి ఉన్నట్లు టాక్. ఈ నేపథ్యంలో మేకర్స్‌తో మాట్లాడి,



మేకింగ్‌ను మరింత పక్కాగా ప్లాన్ చేసి షూటింగ్ వేగవంతం చేయాలని సూచించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ న్యూస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇక ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ మరో తమిళ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తో కూడా సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన రావడంతో ఫ్యాన్స్‌లో మరింత ఎగ్జైట్మెంట్ పెరిగింది. ఆ సినిమా కూడా భారీ పాన్ ఇండియా లెవల్‌లో తెరకెక్కనుందని టాక్ వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే, అట్లీ - అల్లు అర్జున్ కాంబినేషన్ మూవీ 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ రెండు ప్రాజెక్ట్స్ పూర్తయ్యే సరికి అల్లు అర్జున్ రేంజ్ గ్లోబల్ లెవల్‌కు వెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫ్యాన్స్ మాత్రం ఈ భారీ సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# లోకేశ్ కకనగరాజ్ హీరోగా డిసి

'ఖైదీ', 'విక్రమ్', 'కూలీ' వంటి విజయవంతమైన చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు నటుడిగా మారబోతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డీసీ' . ఈ సినిమాకు అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా.. సన్ పిక్చర్స్ నిర్మిస్తుంది. లోకేశ్ కనగరాజ్ సరసన వామికా గబ్బీ కథానాయికగా నటిస్తుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను వాలంటైన్స్ కానుకగా విడుదల చేసింది చిత్రయూనిట్. గ్లింప్స్ లో లోకేష్ కనగరాజ్ ఇంటెన్స్ అండ్ రా లుక్ లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. లోకేష్ ఇందులో దేవదాస్ పాత్రలో కనిపించబోతున్నాడు.






## ఘట్టమనేని మరో వారసుడు జయకృష్ణ ఎంట్రీ

### శ్రీనివాస మంగాపురం మూవీ పోస్టర్ విడుదల

వాలంటైన్స్ డే సందర్భంగా తెలుగు సినీ ప్రియులకు ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం నేడు విడుదల చేసింది. విడుదలైన పోస్టర్‌లో 'ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని, వెయ్యేళ్ళ నా ఈ ఎడబాటుని' అంటూ కథానాయకుడు శ్రీను మంగతో చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుండడంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతుంది. ఇక ఈ సినిమాకు ఆర్ ఎక్స్ 100, మంగళవారం చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నాడు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా మరియు ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ వంటి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

## చట్టం చిత్రం

# ఏప్రిల్ 1న మ పెళ్లి నిజమే

### ర్యూమర్స్‌పై చమత్కరించిన మృణాళ్ ఠాకూర్


సినీ ఇండస్ట్రీలో రూమర్స్ అనేవి కొత్త విషయం కాదు. ఇద్దరు నటీనటులు కలిసి ఒక ఈవెంట్‌లో కనిపించినా, సోషల్ మీడియాలో వారిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనే వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరియు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ విషయంలో కూడా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారన్న ప్రచారం సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ రూమర్స్‌కు అసలు కారణం ఒక పార్టీ. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ ఇద్దరూ కలిసి కనిపించడంతో మొదట సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దానికి తోడు మృణాల్ నటించిన ఓ సినిమా ఈవెంట్‌కు ధనుష్ హాజరుకావడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అప్పటి నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వరుసగా వినిపించాయి. మృణాల్ గతంలో 'మేము కేవలం మంచి స్నేహితులమే' అని చెప్పినా కూడా ఈ ప్రచారానికి బ్రేక్ పడలేదు. కొందరు అయితే మరో అడుగు ముందుకేసి వాలెంటైన్స్ డే రోజున అంటే ఫిబ్రవరి 14న వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని కథనాలు సృష్టించారు. ఇటీవల తన హిందీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ ఠాకూర్‌ను ఈ విషయంపై ప్రశ్నించారు. ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?' అని అడగగా మృణాల్ నవ్వుతూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. ఫిబ్రవరి 14 కాదు ఏప్రిల్ 1న చేసుకుంటానేమో. ఎందుకంటే అది ఏప్రిల్ ఫూల్స్ డే కదా!' అంటూ చమత్కరించింది. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. అదే ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ, 'ఈ రూమర్స్ ఎక్కడి నుంచి వచ్చాయో కూడా నాకు తెలియదు. కొందరు 'మృణాల్ పెళ్లి అధికారికంగా ఖరారు అయింది' అంటూ ప్రచారం చేస్తున్నారు. ఇది నిజంగా భయంకరంగా ఉంది' అని చెప్పింది. ఇలా క్లియర్ క్లారిటీ ద్వారా ధనుష్‌తో పెళ్లి వార్తలకు మృణాల్ పూర్తిగా చెక్ పెట్టినట్టే అయ్యింది.






# రోషన్ హీరోగా ఏమో ఏమో ఇది మూవీ

ఛాంపియన్ హీరో రోషన్ మేక టాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే క్లాసిక్ టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. వాలెంటైన్స్ డే సందర్భంగా శనివారం ఈ సినిమా టైటిల్‌తో పాటు 'ద ఫస్ట్ బ్రీజ్' పేరుతో ఒక చిన్న గ్లింప్స్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇప్పటివరకు 'హిట్' సిరీస్, 'సైంధవ్' వంటి ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్లతో మెప్పించిన శైలేష్ కొలను, ఈసారి పూర్తి భిన్నంగా రొమాంటిక్ కామెడీ జానర్‌ను ఎంచుకోవడం విశేషం. ఈ గ్లింప్స్‌లో హీరో రోషన్ (అభయ్) తన తల్లితో అమ్మాయిల గురించి, నేటి తరం రిలేషన్ షిప్స్ గురించి చేసే కామెడీ సంభాషణలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రోషన్ సరసన 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ (అపూర్వ పాత్రలో) కథానాయికగా నటిస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ అందించిన హేషామ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 దసరా కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.



# చట్టం స్పోర్ట్స్

# ఉత్కంఠ పోరులో స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ విజయం



టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా నేడు కోల్‌కతాలో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ అద్భుత విజయం సాధించింది. 5 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తుచేసింది. వెస్టిండీస్ చేతిలో ఓటమి తర్వాత డీలా పడ్డ ఇంగ్లాండ్‌కు ఈ గెలుపు టానిక్‌లా పనిచేసింది. మొదట బౌలింగ్‌లో అదిల్ రషీద్ మాయ చేయగా, ఛేజింగ్ లో టామ్ బాంటన్ వీరోచిత ఇన్నింగ్స్ తో జట్టును గెలిపించాడు. స్కాట్లాండ్ నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ మరో 10 బంతులు మిగిలి ఉండగానే, 18.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ గెలుపుతో ఇంగ్లాండ్ తన సూపర్-8 అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ సారథి హ్యారీ బ్రూక్ బౌలింగ్ ఎంచుకోవడంతో స్కాట్లాండ్ బ్యాటింగ్ కు దిగింది. ఇంగ్లీష్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు స్కాట్లాండ్ బ్యాటర్లు నిలవలేకపోయారు. ఆ జట్టు నిర్ణీత 19.4 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌట్ అయ్యింది. స్కాట్లాండ్ తరపున రిచీ బెరింగ్టన్ 49 పరుగులతో ఒంటరి పోరాటం చేయగా, టామ్ బ్రూస్ 24 పరుగులు జోడించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో వెటరన్ స్పిన్నర్ అదిల్ రషీద్ 36 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. పేసర్ జోఫ్రా ఆర్చర్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థి స్కోరును కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. 153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (2), జాస్ బట్లర్ తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఆ తర్వాత వచ్చిన జాకబ్ బెథెల్, కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా స్వీప్ షాట్లకు ప్రయత్నించి వికెట్లు పారేసుకున్నారు. దీంతో ఇంగ్లాండ్ శిబిరంలో ఆందోళన మొదలైంది. అయితే ఈ దశలో క్రీజులోకి వచ్చిన టామ్ బాంటన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 41 బంతుల్లోనే అజేయంగా 63 పరుగులు చేశాడు. ముఖ్యంగా మార్క్ వాట్ వేసిన ఒకే ఓవర్లో మూడు భారీ సిక్సర్లు బాది మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. సామ్ కరన్ (28) అతనికి చక్కటి సహకారం అందించాడు. చివర్లో విల్ జాక్స్ విన్నింగ్ షాట్ కొట్టి లాంఛనం పూర్తి చేశాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడిన టామ్ బాంటన్ కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ విజయంతో ఇంగ్లాండ్ గ్రూప్-సి పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మెరుగుపచుకుని తదుపరి దశకు వెళ్లే అవకాశాలను పెంచుకుంది. మరోవైపు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ స్కాట్లాండ్ కు నిరాశే మిగిలింది.

# ప్రియురాలికి హార్దిక్ పాండ్యా మరిచిపోలేని జ్ఞాపకం



ఫిబ్రవరి 15న పాకిస్తాన్‌తో హైవోల్టేజ్ ఉన్నప్పటికీ భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన గర్ల్‌ఫ్రెండ్ మహికా శర్మకు ఈ వాలెంటైన్స్ డేని మరింత ప్రత్యేకంగా మార్చారు. తన గర్ల్‌ఫ్రెండ్ పేరులోని మొదటి అక్షరం 'వీ'ని తన మెడ వెనుక భాగంలో పాండ్యా టాటూ వేయించుకున్నాడు. ఈ టాటూను సెలబ్రిటీ టాటూ ఆర్టిస్ట్ సన్నీ భానుశాలి, లీడ్ ఆర్టిస్ట్ తుషార్ మరానే రూపొందించారు. హార్దిక్ ఎం అక్షరంతో కొత్త టాటూ మహికా శర్మపై తన ప్రేమను వ్యక్తం చేస్తోంది. ఈ వాలెంటైన్స్ డే ఆమెకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఫ్యాన్స్ సైతం కామెంట్లు చేస్తున్నారు. టీమ్ సమాచారం ప్రకారం, హార్దిక్ పాండ్యా మొదట మహికా కోసం కేవలం ఒక చిన్న టాటూ వేయించుకోవాలని అనుకున్నాడు. కానీ వారు తమ రిలేషన్, ఒకరి గురించి ఒకరు మాట్లాడుకుంటున్నప్పుడు, ఆ ఐడియా పెద్దదిగా మారింది. చివరికి వాలెంటైన్స్ డే గిఫ్ట్ గా మారింది. టాటూలో మీరు గమనిస్తే.. 2 చిరుతపులులు ఉన్నాయి. మొదటి చిరుతపులి చాలా పవర్‌ఫుల్, నేచురల్‌గా కనిపిస్తుంది. ఇది హార్దిక్ పాండ్యా బలాన్ని, శ్రమను సూచిస్తుంది. రెండో చిరుతపులి లైన్ ఆర్ట్‌లో రూపొందించారు. ఇది మొదటి చిరుత చుట్టూ తిరుగుతున్నట్లు ఉంటుంది. తన గాళ్‌ఫ్రెండ్ మహికా పేరులోని మొదటి అక్షరం 'వీ' స్పష్టంగా కనిపిస్తుంది. హార్దిక్ మొదట కేవలం మహికా పేరులోని మొదటి అక్షరాన్ని మాత్రమే టాటూ వేయించుకోవాలని భావించాడని సన్నీ భానుశాలి తెలిపారు. కానీ మాట్లాడుతున్న సమయంలో వారి బంధంలోని ఒక స్పెషల్ స్టోరీ బయటకు వచ్చింది. వారు ఒకరికొకరు బలాన్ని అందించే పార్ట్‌నర్స్ కావాలని భావించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అర్థవంతంగా చూపించడానికి చిరుతపులి టాటూ సరైన చిహ్నంగా మారింది. ఈ టాటూ కేవలం ఫ్యాషన్ కోసం మాత్రమే కాదు. కొన్ని టాటూలు కేవలం అడిగితే, లేక ఎవరైనా సూచిస్తే వేసుకుంటారు. కానీ కొన్ని వాటంతట అవే రూపుదిద్దుకుంటాయి. హార్దిక్ ఈ టాటూ నమ్మకంతో పాటు భావోద్వేగంతో తయారైంది. టాటూ ఏదైనా రియల్ స్టోరీని ప్రతిబింబించినప్పుడు, అది కేవలం రంగుగా మాత్రం మిగిలిపోదు. వారికి, ప్రియమైన వ్యక్తికి అది ఒక జ్ఞాపకంగా మారుతుంది. హార్దిక్ పాండ్యా గత ఏడాది 2025లో మహికా శర్మతో తన రిలేషన్ పై స్పందించాడు. ప్రస్తుతం వీరు ప్రేమలో మునిగి తేలుతున్నారు. గతంలో హార్దిక్ పాండ్యా విదేశీ మోడల్, బాలీవుడ్ నటి నటాషా స్టాంకోవిచ్‌ను వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ మే 2020లో ఇంట్లోనే సాధారణంగా వివాహం చేసుకోగా, ఫిబ్రవరి 2023లో రాజస్థాన్‌లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వైభవంగా పెళ్లి చేసుకున్నారు. ఏడాదిన్నరలోనే కథ ముగిసింది. అభిప్రాయభేదాలు రావడంతో జూలై 2024లో వారు విడిపోతున్నట్లు ప్రకటించారు. వీరికి కుమారుడు అగస్త్య ఉండగా.. బాలుడి బాధ్యతలను ఇద్దరూ చూసుకుంటున్నారు.

............

# కుల్దీప్ లేకుండా భారత్ మ్యాచ్ గెలవలేదు

## టీమిండియా లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్





ఫిబ్రవరి 15న పాకిస్థాన్‌తో భారత్ తదుపరి మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో, రెండు దేశాల అనుభవజ్ఞులు తమ తమ జట్లపై సలహాలు ఇవ్వడం ప్రారంభించారు. పాకిస్థాన్‌తో జరిగే హై-వోల్టేజ్ టీ20 ప్రపంచ కప్ మ్యాచ్ కోసం టీమిండియా తన ప్లేయింగ్ ఎలెవెన్‌లో కీలక మార్పు చేయాలని సునీల్ గవాస్కర్ సూచించారు. స్పిన్‌కు అనుకూలమైన కొలంబో పిచ్‌పై భారత్ గెలవాలంటే, అర్ష్‌దీప్ సింగ్ స్థానంలో ఈ పవర్ ఫుల్ స్పిన్నర్‌ను ఖచ్చితంగా జట్టులోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌కు ముందు భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, లెజెండరీ వ్యాఖ్యాత సునీల్ గవాస్కర్ భారత జట్టు యాజమాన్యానికి ఒక ప్రధాన సూచన చేశారు. ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ప్రస్తుతం ఫామ్‌లో లేడని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. నమీబియాతో జరిగిన చివరి మ్యాచ్‌ను వివరిస్తూ, నమీబియా బ్యాట్స్‌మెన్స్ అర్ష్‌దీప్‌ను ఓడించిన విధానం, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పూర్తి ఓవర్లు కూడా బౌలింగ్ చేయించలేకపోయాడని, పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అతని స్థానంలో స్పిన్నర్‌ను ఆడించాలని ఇది సూచిస్తుందని అన్నారు. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే బౌలింగ్ చేస్తున్నప్పుడు అర్ష్‌దీప్ తన నాలుగు ఓవర్లు పూర్తి చేయలేదని సునీల్ గవాస్కర్ తెలిపారు. కెప్టెన్‌కి అతనిపై ఉన్న నమ్మకం సన్నగిల్లిందని స్పష్టంగా తెలుస్తుంది. పాకిస్తాన్ లాంటి బలమైన జట్టుతో పోటీ పడేటప్పుడు, ఒత్తిడిలో పరుగులు లీక్ చేసే బౌలర్‌తో మీరు రిస్క్ తీసుకోలేరంటూ ఎత్తిచూపాడు. గవాస్కర్ ప్రకటన సాధారణమైనది కాదు, ఎందుకంటే అతను తరచుగా జట్టు ప్రదర్శనను నిశితంగా పర్యవేక్షిస్తుంటాడు. పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లు ఎల్లప్పుడూ ఒత్తిడితో కూడిన ఆట అని, శ్రీలంక పిచ్‌లు, ముఖ్యంగా కొలంబోను స్పిన్నర్లకు స్వర్గధామంగా భావిస్తారని సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. కుల్దీప్ యాదవ్ మణికట్టు స్పిన్ పాకిస్తాన్ మిడిల్ ఆర్డర్‌ను నాశనం చేసే అవకాశం ఉందని గవాస్కర్ నొక్కి చెప్పాడు. భారత్ ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో ఆడినప్పుడల్లా వారు విజయం సాధించారని చరిత్ర చూపిస్తుందని ఆయన అన్నారు. కుల్దీప్ యాదవ్ మ్యాచ్ విన్నర్ అని, అతను లేకుండా పాకిస్థాన్‌ను ఓడించడం కష్టమని ఆయన అన్నారు. హార్దిక్ పాండ్యా మొదటి ఓవర్ వేయడం చూస్తే, పాకిస్తాన్ మ్యాచ్ కోసం అర్ష్‌దీప్ స్థానంలో జట్టు యాజమాన్యం ఇప్పటికే ఎవరిని ఎంపిక చేస్తుందో అర్థం అవుతుందని గవాస్కర్ అన్నారు. జట్టులో కుల్దీప్ ఉండటం బౌలింగ్ కు వైవిధ్యాన్ని జోడించడమే కాకుండా వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ లతో కలిసి పాకిస్తాన్ ఆటగాళ్లను ట్రాప్ చేయగలడు. దీనిని పాకిస్తాన్ బ్యాటర్స్ అధిగమించడం కష్టమని నిరూపించవచ్చు. కుల్దీప్ ను మాత్రమే కాకుండా వరుణ్ చక్రవర్తిని కూడా సునీల్ గవాస్కర్ ప్రశంసించారు. వరుణ్ తక్కువ ఓవర్లు బౌలింగ్ చేసినప్పటికీ, అతని వికెట్ తీసే సామర్థ్యం స్పష్టంగా కనిపించిందని ఆయన అన్నారు. వరుణ్, కుల్దీప్ కలిసి బౌలింగ్ చేస్తే పాకిస్తాన్ బ్యాటింగ్ కుప్పకూలిపోతుందని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా బౌలింగ్ చేసి వికెట్లు తీసిన అక్షర్ పటేల్ ప్రదర్శనను కూడా ఆయన ప్రశంసించారు. ఇంతలో, టీం ఇండియాకు మరో శుభవార్త ఏమిటంటే, ఓపెనర్ అభిషేక్ శర్మ కడుపు ఇన్ఫెక్షన్ నుంచి కోలుకున్నాడు. పాకిస్థాన్‌తో జరిగే ఎంపికకు అందుబాటులో ఉంటాడు. వరుణ్ చక్రవర్తి స్వయంగా ఈ విషయాన్ని ధృవీకరించాడు. ప్రస్తుత పరిస్థితుల్లో కుల్దీప్ యాదవ్‌ను ప్లేయింగ్ ఇ×లో చేర్చడం అత్యంత వివేకవంతమైన నిర్ణయం అని సునీల్ గవాస్కర్ తేల్చిచెప్పారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ గౌతమ్ గంభీర్ గవాస్కర్ సలహాను ఎలా పాటిస్తారో చూడాలి.

## సమాలోచనలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ నలుగురు కీలక ప్లేయర్లను బరిలోకి దిగే చాన్స్

### నేడు కొలంబోలో పాక్ తో ఇండియా మ్యాచ్

## పాకిస్తాన్ తో కీలక మ్యాచ్ కోసం టీమిండియా కసరత్తు



2026 టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్థాన్‌తో జరిగే కీలక పోరుకు భారత జట్టు సిద్ధంగా ఉంది. ఈ బ్లాక్‌బస్టర్ మ్యాచ్ కోసం కోచ్ గౌతమ్ గంభీర్ ఓ మాస్టర్ ప్లాన్ రూపొందించాడు. ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఒకేసారి నలుగురు మ్యాచ్ విన్నింగ్ స్పిన్నర్లను రంగంలోకి దింపేందుకు సిద్ధమయ్యాడు. అంటే, ఫిబ్రవరి 15న కొలంబోలో జరిగే మ్యాచ్‌లో కోచ్ గౌతమ్ గంభీర్ తన స్పిన్ అస్త్రాలను పాకిస్థాన్ జట్టుపై ప్రయోగించేందుకు సిద్ధమయ్యాడు. భారత స్పిన్ ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తిగా ఫిట్ గా ఉన్నాడు. జట్టులో చేరాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో సుందర్‌కు ఆడే అవకాశం రాలేదు. కానీ, కోచ్ గౌతమ్ గంభీర్ ఈ యువ స్పిన్ ఆల్ రౌండర్‌ను పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో నేరుగా బరిలోకి దించవచ్చని భావిస్తున్నారు. సుందర్ తన బౌలింగ్ తోనే కాదు, బ్యాటింగ్ ఆర్డర్‌లో భారీ షాట్లు కూడా కొట్టగలడు. ఇది మ్యాచ్‌లో కీలకం అవుతుంది. 2026 టీ20 ప్రపంచ కప్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు అవకాశం ఇవ్వలేదు. అయితే, కుల్దీప్ యాదవ్ ఆర్. ప్రేమదాస స్టేడియంలో పాకిస్థాన్‌పై ఆడే ఛాన్స్ ఉంది. పాకిస్తాన్‌తో జరిగిన 3 టీ20 మ్యాచ్‌ల్లో కుల్దీప్ 8 వికెట్లు పడగొట్టాడు. అదే సమయంలో 6.58 ఎకానమీ రేటును కూడా కొనసాగించాడు. అందుకే కోచ్ గౌతమ్ గంభీర్ కుల్దీప్‌ను ఎలాగైనా ఆడించాలని కోరుకుంటాడు. గతంలో పాకిస్తాన్ బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టిన ఆర్. ప్రేమదాస పిచ్‌పై కుల్దీప్ యాదవ్ భారత్‌కు గేమ్ ఛేంజర్‌గా నిరూపించబడవచ్చు. భారత జట్టు వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ పాత్ర పాకిస్తాన్ పై చాలా ముఖ్యమైనది కానుంది. ఎందుకంటే, అక్షర్ తన ఎడమ చేతి వేలు స్పిన్ తో పాకిస్తాన్ ను ఇబ్బంది పెట్టడమే కాకుండా, బ్యాట్ తో భారీ ఇన్నింగ్స్ ఆడే సామర్థ్యం కూడా కలిగి ఉన్నాడు. పాకిస్థాన్‌తో జరిగే బిగ్ మ్యాచ్‌లో అక్షర్ పటేల్ తన నాలుగు ఓవర్లలో వీలైనన్ని ఎక్కువ వికెట్లు తీయాలని లక్ష్యంగా పెట్టుకుంటాడు. కోచ్ గౌతమ్ గంభీర్ మాస్టర్ ప్లాన్ ప్రకారం, అక్షర్ ఈ ప్రయత్నంలో కీలక ఆటగాడు కావొచ్చు. కుడిచేతి వాటం మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్పిన్ చాలా మంది బ్యాట్స్‌మెన్‌లకు అర్థం కాదు. అయితే, స్పిన్-ఫ్రెండ్లీ ఆర్. ప్రేమదాస పిచ్‌పై, వరుణ్ మరింత ప్రమాదకరమైన బౌలర్‌గా మారవచ్చు. పాకిస్థాన్‌తో జరిగిన నాలుగు టీ20ఐలలో వరుణ్ కేవలం మూడు వికెట్లు మాత్రమే తీసుకున్నప్పటికీ, 2026 ప్రపంచ కప్‌లో తన గణాంకాలను మార్చుకోవాలని చూస్తున్నాడు. 2026లో భారతదేశం తరపున ఐదు మ్యాచ్‌ల్లో వరుణ్ ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. అతని ఎకానమీ రేటు కేవలం 7.72 మాత్రమే.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999